


ఉష్ణోగ్రత (అంచనా) 7-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	40	27
నరసరావుపేట	39	27
బాపట్ల	39	28
రెంటచింతల	40	28
చీరాల	39	28



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

● కేంద్రాల వద్ద అభ్యర్థుల కోలాహలం

గుంటూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తుండగా అభ్యర్థులు కేంద్రాలకు తరలివచ్చారు. జిల్లాలో పది కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ నెల 30 వరకు విడతల వారీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో రేణుక తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించమని ముందుగానే స్పష్టం చేయడంతో అభ్యర్థులు నిర్దేశించిన సమయం కంటే దాదాపు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఎండల నేపథ్యంలో కేంద్రాల్లో అభ్యర్థుల కోసం తాగు నీరు ఇతర సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.


స్టెమ్ ల్యాబ్ కిట్లను పరిశీలన



పీఎంశ్రీ పాఠశాలలకు అందించే స్టెమ్ ల్యాబ్ కిట్లను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉండవల్లి నివాసంలో పరిశీలించారు. రీసెర్చ్, కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా రూపొందించిన ఈ కిట్లలో 335 రకాల వస్తువులు ఉంటాయి. - మంగళగిరి (ఆంధ్రజ్యోతి)

గత పాపం

అన్నదాతకు శాపం!



● అన్నదాత సుఖీభవ పథకానికి సాంకేతిక చిక్కులు
● వైసీపీ అస్తవ్యస్త రీసర్వేతో రైతుల లబోదిబో
● తహసీల్దార్ లాగిన్‌లకు వేలల్లో రెవెన్యూ రికార్డులు
● లబ్ధికి దూరం చేయొద్దంటూ అన్నదాతల వేడుకోలు
● తుది నిర్ణయంపై యంత్రాంగం తర్జనభర్జన

గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ ప్రస్తుతం రైతులకు శాపంగా మారుతోంది. ఒక నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఇష్టారీతిన భూ రికార్డులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని ఉన్న పళంగా సరిచేసుకోలేక రైతు లు లబోదిబోమంటున్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసే కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఆన్‌లైన్ రికార్డులన్నీ యంత్రాంగం వద్దకు చేరా యి. వేల సంఖ్యలో రెవెన్యూ చిక్కులు కనబడ డంతో వాటిని తహసీల్దార్ లాగిన్‌లకు వెరిఫి కేషన్ కోసం పంపించారు. ఇలా పంపించిన వాటిలో దాదాపు 70 శాతం గత ప్రభుత్వం చేసిన రీసర్వే తప్పిదాలేనని తెలుస్తోంది. రెవెన్యూ చిక్కులు తేలకుండా అన్న దాత సుఖీభవ పథకం అర్హుల జాబితా లో చేర్చడంపై తుది నిర్ణయం తీసుకోలేమనేది అధికారుల వాదనగా ఉంది.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ ప్రకారం సాగు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని వ్యవసాయశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడతల్లో ఇచ్చే రూ.6 వేలు సాయానికి మరో రూ.14 వేలు కలిపి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు సాయం అందించనుంది. ఈ నెల రెండో వారంలోనే ఈ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

మూడు జిల్లాల్లో 68 వేలు పెండింగ్

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టే క్రమంలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉన్న రికార్డులను మరోసారి పరిశీలించి జాబితా సిద్ధం చేశారు. బాపట్ల జిల్లాలో మొత్తం 3,41,974 ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి 2,97,630 మందిని అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీటి విషయంలో కూడా వ్యవసాయ కమిషనరేట్ (మిగతా 6వ పేజీలో)



ఉచిత బియ్యం.. రూ. 13

● బహిరంగంగా షాపుల వద్దే కొనుగోలు
● బ్లాక్ మార్కెటింగ్ మొదలు పెట్టిన డీలర్లు
● కేజీకి రూ.4 లాభంతో మాఫియాకి చేర వేస్తున్న వైనం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరా వాహనాలతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంది.. అక్రమాలను అడ్డుకోవాలి.. అని కూటమి ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను ప్రవేశపెట్టగా రేషన్ అక్రమాలు యథావిధిగానే కొనసాగుతున్నాయి. అయితే గతంలో ఎండీయూ వాహన దారులు పాత్రను ఇప్పుడు రేషన్ డీలర్లు తీసుకున్నారు. గతంలో ఎండీయూ వాహనదారులు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులతో సరిపెట్టగా అదే పంథాను ఇప్పుడు పలు ప్రాంతాల్లోని డీలర్లు చేస్తున్నారు. అయితే గతంలో కార్డుదారులకు రేషన్‌వాహనదారులు రూ.8 నుంచి రూ.10 వరకు ఇవ్వగా ఇప్పుడు డీలర్లు ఆ మొత్తాన్ని రూ.13 కు పెంచారు. ఐదు రోజుల్లోనే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలువురు రేషన్ డీలర్లు బ్లాక్ మార్కెటింగ్‌ని మొదలు పెట్టేశారు. షాపుల వద్ద ఎలాంటి బెదురు లేకుం డా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.13 చొప్పున లెక్కకట్టి కార్డుదారులతో వేలిముద్ర వేయించుకుని నగదు ఇస్తున్నారు. సాయంత్రానికి అన్ని లెక్కలు సరిచూసుకుని మాఫియా పంపించే వాహనంలో బియ్యాన్ని తరలిస్తున్నారు. కేజీకి రూ.4 లాభం చూసుకుని మాఫియాకి రూ.17కి విక్రయిస్తు న్నారు. కాగా రేషన్ మాఫియాలోని వ్యక్తులు ఆ బియ్యాన్ని మిల్లర్లకు ఇచ్చి మరో రూ.4 మిగిల్చుకుంటున్నారని సమాచారం.

తూతూమంత్రంగా తనిఖీలు

పౌరసరఫరాల అధికారులను నిత్యం షాపులను తనిఖీ చేసి నిల్వలు సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించినప్పటికీ ఒక్కో సీఎస్‌డీటీ కింద వందకు పైగా షాపులు ఉండటంతో వాళ్లు సరిగా చూడలేకపోతున్నారు. డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభమై ఐదు రోజులు పూర్తి కాగా దాదాపుగా 56.74 శాతం పంపిణీ పూర్తి అయింది. ఇందులో కనీసం 20 శాతం ఇప్పటికే నల్లబజారుకు తరలి నట్లు ఒక అంచనా. తనిఖీలు తూతూ మంత్రంగానే ఉం టుండటంతోనే డీలర్ల అక్రమాలు వెలుగుచూడటంలేదని తెలుస్తోంది. ఈ ఐదు రోజుల్లో కనీసం ఒక్క కేసు అయినా నమోదు చేసిన దాఖలాలు లేవు. గుంటూరు జిల్లాలో 972 దుకాణాలు ఉండగా 5 లక్షల 89 వేల 531 కార్డులున్నాయి. ఇప్పటివరకు 3,31,562 కార్డుదారులకు పంపిణీ చేసి రాష్ట్రంలో 24వ స్థానం అంటే కింది నుంచి మూడులో ఉన్న ది. బాపట్ల జిల్లా 62.32 శాతం పంపిణీతో 15వ స్థానం, 68.99 శాతంతో పల్నాడు జిల్లా మూడో స్థానంలో ఉంది.

షైనింగ్ స్టార్స్.. 461 మంది

గుంటూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు అందజేయనున్నారు. అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 461 మంది ఎంపికైనట్లు విద్యాశాఖ ప్రకటించింది. గుంటూరు జిల్లా నుంచి 112 మంది, బాపట్ల జిల్లా నుంచి 185 మంది, పల్నాడు జిల్లా నుంచి 164 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాల బాలికలు, సామాజిక వర్గాల వారీగా విద్యార్థులను ఎంపిక చేశారు. త్వరలో విద్యామంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో షైనింగ్‌స్టార్స్‌గా ఎంపికైన 461 మందికి నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక అందజేస్తారని విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు.

విధుల్లో నిర్లక్ష్యం.. వేటు

● ఏఈ సరెండర్, ఇద్దరు ఉద్యోగుల తొలగింపు



గుంటూరు(కార్పొరేషన్), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాలో అక్రమాలు.. విధుల్లో నిర్లక్ష్యంపై నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పందించారు. ఓ ఏఈని సరెండర్ చేయగా, ఇద్దరు ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ను శుక్రవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్యాంకర్ల వివరాలు నమోదు రిజిష్టర్‌ను పరిశీలించి నీటిని తరలిస్తున్న ట్యాంకర్ల వివరాలకు వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించారు. రిజర్వాయర్ నుంచి అనధికార నీటి తరలింపుపై గతంలో కూడా అందిన ఫిర్యాదుల మేరకు విధుల్లో సక్రమంగా ఉండాలని హెచ్చరించినా పని తీరు మార్చుకోలేదని ఏఈ రవికిరణ్‌ని మాతృ శాఖకు సరెండర్ చేయాలని, సిబ్బంది శేషయ్య, నాగరాజులను విధుల నుంచి తొలగించాలని ఎస్ఈని ఆదేశించారు. రోజువారీ పర్యటనల్లో రిజర్వాయర్లను తనిఖీలు చేస్తావని, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించి, తాగునీటి సరఫరాపై గత పర్యటనలో ఇచ్చిన ఆదేశాను పాటించని ఇంజనీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, షేక్ మీరావలి, డీఈఈలు నాగభూషణం, రమేష్‌బాబు, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఎన్వీఎస్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎంటీఎంసీకి.. రూ.111.50 కోట్లు

● విలీన గ్రామాల్లో తాగునీటికి సీఆర్‌డీఏ నిధులు
● సమగ్ర తాగునీటి పథకం కోసం పరిపాలన అనుమతి

మంగళగిరి, గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనమైన 15 గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ చర్యలు చేపట్టింది. మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు సమగ్ర తాగునీటి పథకం పూర్తి చేసేందుకు మున్సిపల్ మంత్రి నారాయణ సీఆర్‌డీఏ నిధులు కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ తాగునీటి పథకానికి అవసరమైన రూ.450.24 కోట్లు యూఐడీఎఫ్, అమృత్, సీఆర్‌డీఏ నుంచి నిధులు సమకూరనున్నాయి. రూ.111.50 కోట్లకు పరిపాలన అనుమతిని మంజూరు చేయాలని ఈఎన్‌సీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే ఎంటీఎంసీ సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నందున అవసరమైన నిధులను ఆ సంస్థ మంజూరు చేస్తుందని మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంటీఎంసీకి సమగ్ర తాగునీటి పథకం నిర్మించేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ సంస్థ కమిషనర్ నివేదికను పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీకి పంపించారు. ఈ స్కీమ్ ద్వారా పూర్వ మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలతో పాటు



కొత్తగా విలీనమైన 15 గ్రామాలకు (సీఆర్‌డీఏలో కలిపే ఆరు గ్రామాలు తీసే సి) సురక్షితమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయనున్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమై వేగవంతంగా పూర్తి అవుతాయని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ స్కీమ్ పూర్తి అయితే మం గళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్య తీరిపోతుంది.

2021 నుంచి పనులు ప్రారంభం

2021 మార్చి 23న ఎంటీఎంసీ ఏర్పడగా అప్పట్లో ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ద్వారా రూ.221.52 కోట్లతో వాటర్ స్కీమ్‌ని మంజూరు చేశారు. మంగళగిరి పరిధిలో రూ.98.09 కోట్లు, తాడేపల్లిలో రూ.123.43 కోట్లతో పనులు ప్రతిపాదించారు. అయితే బ్యాంకు రుణం విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పాక్షికంగా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎలివేటెడ్ లెవల్ సర్వీసు రిజర్వాయర్లు(ఈఎల్ఎస్ఆర్‌లు) నిర్మించారు. అయితే కొత్తగా విలీనమైన గ్రామాల వల్ల నేరుగా కృష్ణానది నుంచి తాగునీటిని తీసుకునేలా సమగ్ర పథకాన్ని ప్రతిపాదించారు. డీపీఆర్‌లో కృష్ణానది నుంచి ఇన్‌టేక్ వాటర్, శుద్ధి చేసే సదుపాయాలు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కులు వంటివి నిర్మించాల్సి ఉన్నది. 2056 వరకు జనాభా పెరుగుదలని దృష్టిలో పెట్టుకుని ఈ స్కీమ్‌ని డిజైన్ చేశారు. దీనికి అయితే ఆ నిధుల్లో యూఐడీఎఫ్ నుంచి రూ.287.54 కోట్లు, అమృత్ 2.0 స్కీమ్ ద్వారా రూ.51.20 కోట్లు, బ్యాలెన్స్ పనులకు రూ.111.50 కోట్లు ప్రతిపాదించారు.

మహిళా మీ కోసం.. నిరుపయోగం


● అవగాహనా లోపంతో అంతంతమాత్రంగానే సేవలు
● రాత్రిళ్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా పోలీసుల రూపకల్పన



తెనాలి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్ల లో వచ్చి రాత్రి వేళల్లో ఇళ్లకు చేరేందుకు ఇబ్బందులు పడే ఒంటరి మహిళలు, యువతుల కోసం పోలీసుశాఖ 'మహిళా మీ కోసం' వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. అయితే వినూత్నంగా రూపొందించిన ఈ కార్యక్రమంపై మహి ళలు, యువతుల్లో అవగాహన లేక నిరుపయోగంగా మారింది. మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత సంవత్సరం నవంబరు 25న ఎస్పీ సతీష్‌కుమార్ 'మహిళా మీ కోసం వాహనాల సేవలను ప్రారంభించారు. తొలుత గుంటూరు, తెనాలి, మంగళగిరిలో వీటి సేవలను ప్రవేశపెట్టా రు. రాత్రి వేళల్లో బస్సు, రైళ్లలో ఆయా ప్రాంతాల్లో దిగి ఇళ్లకు చేరేందుకు మహిళలు, యువతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్ర యాణాలపై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్న క్రమంలో వారికి రక్షణగా పోలీసులు ఉండి ప్రత్యేక వాహనంలో సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు ఈ సేవలకు ఎస్పీ శ్రీకారం చుట్టారు. ఈ వాహనాల సేవలను పూర్తి ఉచితం. టోల్‌ఫ్రీ నెంబరు 112కు ఫోన్ చేస్తే ఆయా ప్రాంతంలో ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది. వెంటనే సాయం అందించేందుకు పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని సంబంధిత మహిళను గమ్యస్థానానికి చేరుస్తారు. మహిళలు, బాలికలు వేధింపులు ఎదుర్కొంటున్నా కూడా ఈ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. పోలీసుల హెల్ప్‌లైన్ నెంబరు 9746414641 అందుబాటులోకి తీసుకువచ్చారు. మహిళలు ఫోన్ చేసినప్పటి నుంచి వాహనం వారి వద్దకు వెళ్లిందా.. సురక్షితంగా చేర్చారా లేదా అన్న అంశాలను స్వయంగా ఎస్పీ కార్యాలయంలోనే పర్యవేక్షించేలా ఆయా వాహనాలకు జీపీఎస్ స్విచ్‌ను అనుసంధానం చేశారు. అయితే ఈ సేవలపై అంతంతమాత్రంగానే అవగాహన ఉండటంతో వీటిని వినియోగించుకునేవారు స్వల్పంగానే ఉన్నారు. తెనాలి ప్రాంతంలో మహిళా మీ కోసం వాహనాలు ఉన్నా.. దీనికి ప్రత్యేక సిబ్బంది కూడా ఏర్పాటు చేసినా సేవల్లో మాత్రం ఆశించినంతగా విని యోగించుకోవడం లేదు. మహిళా మీ కోసంపై విస్తృత ప్రచారం జరిపితే ప్రజల్లో చైతన్యం పెరిగి వాహనసేవలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

పోల్ టెండర్లలో కిరికిరి

నాలుగు నెలలకు పైగా కాలయాపన



● ఇప్పటి వరకు పిన్నెల్లి అనుచరుడే నిర్వహణ ● వైసీపీ హయాంలో టెండర్లు లేకుండానే దారాదత్తం ● టెండర్ దారులను పక్కన పెట్టి మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం ● విద్యుత్‌శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు దరఖాస్తు దారుల సన్నాహం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఏడాది అవుతుంది. అయినా కొన్ని శాఖల్లో అధికారుల తీరు మారలేదు. విద్యుత్ శాఖలో ఇప్పటికీ వైసీపీ హవా కొనసాగుతోంది. కొందరు వైసీపీ వారికి వంతపాడుతూ వారికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనంగా గుంటూరులోని విద్యుత్ శాఖకు సంబంధించి పోల్‌సెంటర్ నిర్వహణ ఉంది. గుంటూరులోని పోల్ సెంటర్(విద్యుత్ స్థంభాలు తయారీ కేంద్రం) బాధ్యతలు అప్పగించేందుకు గత ఏడాది డిసెంబరు 28న టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న వారు విద్యుత్ శాఖకు రెండేళ్లు పోల్స్ తయారు చేసి ఇవ్వాలి. టెండర్లు దాఖలకు ఈ ఏడాది జనవరి 17 వరకు గడువు ఇచ్చారు. జనవరి 20న ప్రైస్ బిడ్స్ తెరిచి టెండర్ ఖరారు చేయాలని నిర్ణయించారు. అయితే ఇంత వరకు ఆ టెండర్లు వెలుగు చూడలేదు. అప్పటి నుంచి టెండర్ ఫీజుగా రూ.16 లక్షలు చెల్లించిన వారు ఏమి తే లక లబోదిబోమంటున్నారు. గత వైసీపీ హయాంలో పోల్ సెంటర్ దక్కించుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు నిర్వహించాడు. వాస్తవానికి అతడు నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో టెండర్‌ను దక్కించుకున్నాడన్న ఆరోపణలున్నాయి. అయితే అప్పటికి అధికారులు మౌనంగా ఉన్నా.. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే కొనసాగుతున్నాడు. ఆ తర్వాత విమర్శలు రావడంతో అతడ్ని తప్పుకోమన్నట్లుగా అధికారులు టెండర్ల పేరుతో హడావుడి చేశారు. అయితే అతడు తప్పుకోకుండా అధికారుల సూచనలతోనే కోర్టుకు వెళ్ళి టెండర్ల ప్రక్రియ కొద్ది రోజులు నిలిచిపోయేలా చేశాడని సమాచారం. ఉన్నతాధికారుల ఒత్తిడితో కోర్టు కేసు ఉప సంహరింపచేసి అందుకు నజరానాగా పోల్ సెంటర్‌లో ఉన్న స్టాక్‌ను మరికొంత కాలం అతడికే సరఫరా చేసే అవకాశం కల్పించారు. కోర్టు కేసు తొలగిపోవడంతో టెండర్లు తెరిచి అర్హులను (మిగతా 6వ పేజీలో)

ఆపరేషన్ 'రింకీ'

● ఎండీఎంఏ కేసులో కొత్త కోణాలు
● జీవన్ గ్యాంగ్‌కు గుంటూరు గ్యాంగ్‌తో సంబంధాలు

6

ఇద్దరి అరెస్టు.. 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

కౌలుపై కలవరం!

● మే ముగిసినా ప్రారంభం కాని రాజధాని రైతుల కౌలు ప్రక్రియ
● గత ఐదేళ్లూ నరకం చూసిన రైతులు
● కూటమి ప్రభుత్వం వచ్చాక కౌలు దక్కడంతో సంతృప్తి
● పదకొండో ఏడాది కౌలు ఊసే లేకపోవడంతో మళ్లీ ఆందోళన

8

బడ్జెట్‌లో బ్రహ్మాండంగా.. కుటుంబ వేడుకలకు కొత్త ట్రెండ్

● విస్తరిస్తున్న మినీ థియేటర్ల సంస్కృతి
● వెండి తెరలు, అద్భుతమైన బ్యాక్ డ్రాప్‌లు
● అడుగు పెడుతూనే కొత్త ప్రపంచం ఆవిష్కృతం
● కేక్, బెవరేజస్, ఫుడ్ ఐటెంలు ఆర్డర్‌పై సరఫరా
● తక్కువ ఖర్చుతో.. అత్యధిక ఆనందం



ఇద్దరి అరెస్టు.. 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చి వినియోగిస్తున్న ఇద్దర్ని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు మల్లికార్జునపురం ఐదో లైన్‌కి చెందిన ఫొటోగ్రాఫర్ వింజరపు సోమనాథ్, వసంతరాయపురానికి చెందిన చింతల సతీష్ డ్రగ్ వినియోగిస్తున్నారు. నల్లపాడు సీఐ వంశీధర్ వారి ఇళ్లపై దాడులు చేసి అరెస్టు చేశారు వారి నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరికి బెంగళూరులో ఈ డ్రగ్ ఇచ్చిందెవరు అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

పూర్తి సదుపాయాలతో వసతి గృహాలు : వీసీ



వసతి గృహాలను పరిశీలిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం

పెదకాకాని, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర, బాలికల, పరిశోధకుల వసతి గృహాల్లో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం తెలిపారు. వేసవి సెలవుల అనంతరం వసతి గృహాల పునఃప్రారంభం నాటికి పూర్తి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి వర్సిటీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన వివిధ మరమ్మతు పనులు చేపడుతోందని వెల్లడించారు. శుక్రవారం వర్సిటీ పరిధిలోని అన్ని వసతి గృహాలను ఇంజినీరింగ్ విభాగం, వార్డెన్లతో కలిసి మరమ్మత్తు పనులను రిజిస్ట్రార్ పర్యవేక్షించారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతి గృహాల్లో వాషింగ్ మెషిన్లను ఏర్పాటు చేయనున్నామని, వాటిని ఏర్పాటు చేయడానికి అనుకూల ప్రాంతాలను గుర్తించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్లు ఆచార్య మల్లికార్జున్, ఆచార్య మాధవి, ఎలక్ట్రికల్ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు, వాటర్ వర్క్స్ డీఈ కె.సుబ్బారావు, వివిధ శాఖల ఏఈలు డి.సతీష్ కుమార్, ఐ.సాయిరాం, సీహెచ్ ధనుంజయ్, అడిషనల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఆపరేషన్ 'రింకీ'

ఎండీఎంఏ కేసులో కొత్త కోణాలు

జీవన్ గ్యాంగ్‌కు గుంటూరు గ్యాంగ్‌తో సంబంధాలు

ల్యాబ్‌లో నిందితుల ఫోన్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

నోయిడాకు చెందిన రింకీ, ఢిల్లీకి చెందిన బందోపాధ్యాయ చౌదరి.. ఎండీఎంఏ డ్రగ్‌ను నగరానికి చేర్చడంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు వీరు. వీరి చేతికి సంకెళ్లు వేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. ఎండీఎంఏను నోయిడా నుంచి హైదరాబాద్ వరకు ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ల ద్వారా రింకీ పంపితే, దానికి సంబంధించిన డబ్బును బందోపాధ్యాయ చౌదరి క్యూఆర్ కోడ్ స్కానర్‌ను పంపి వసూలు చేసేవాడు. ఇలా హైదరాబాద్‌కు చేరుకున్న ఎండీఎంఏను విజయవాడకు తీసుకొస్తున్న ముగ్గురు యువకులను టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ముగ్గురిలో జీవన్‌కుమార్ మొత్తం గ్యాంగ్‌కు నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఈ ముగ్గురు నిందితులకు ఉన్న లింక్‌ల గురించి పోలీసులు కూపీ లాగడం మొదలుపెట్టారు. కాగా, జీవన్ గ్యాంగ్‌కు గుంటూరుకు చెందిన మరో గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్టు తెలిసింది. జీవన్ సరుకును నోయిడా నుంచి రప్పిస్తుంటే, గుంటూరు గ్యాంగ్ మాత్రం బెంగళూరు నుంచి సరుకును రప్పిస్తున్నట్టు గుర్తించారు. ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య అనేకసార్లు సరుకు మార్పిడి జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక విశ్లేషణ ఆధారంగా..

తిరుమలశెట్టి జీవన్‌కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిలో జీవన్ తెలివిగా వ్యవహరించాడు. ఎప్పుడైనా పోలీసులకు చిక్కితే ఎలాంటి వివరాలు వారికి తెలియకుండా ఉండటానికి రింకీ, బందోపాధ్యాయ చౌదరితో చేసిన చాటింగ్‌ను డిలీట్ చేశాడు. నితీష్‌కుమార్, తరుణ్‌ప్రసాద్ చేసిన చాటింగ్‌నూ తొలగించాడు. అయితే, సాంకేతిక విశ్లేషణ కోసం నిందితులు ముగ్గురి ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. జీవన్‌కుమార్ తొలగించిన మొత్తం డేటాను రిట్రీవ్ చేయాలని నిర్ణయించారు. ఈ ముగ్గురి ఫోన్లలో ఎండీఎంఏను కొనుగోలు చేసిన విద్యార్థుల జాబితా భారీగానే ఉన్నట్టు తెలిసింది. ఈ కేసులో పోలీసులు రింకీని ఏ1గా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. క్యూఆర్ కోడ్‌ను పంపి పేమెంట్ గేట్‌వేల ద్వారా డబ్బు తీసుకున్న బందోపాధ్యాయ చౌదరిని ఏ2గా చేర్చారు. నితీష్, తరుణ్ ఫోన్లలో మాత్రం జీవన్‌తో చేసిన చాటింగ్‌లకు సంబంధించిన కొంత డేటా అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. ఎండీఎంఏ ఆర్డర్ కావాల్సినప్పుడల్లా జీవన్, రింకీతో ఎక్కువగా వాట్సాప్ కాల్స్ మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. మరోపక్క జీవన్‌కు ఎండీఎంఏ రుచి చూపించిన నూజివీడుకు చెందిన మనోహర్ చరిత్రను కూడా పోలీసులు బయటకు లాగుతున్నారు. పార్శిల్‌లో వచ్చిన డ్రగ్‌ను హైదరాబాద్‌కు చేర్చిన ట్రాకర్ ఆన్, డీటీడీసీ కొరియర్ సంస్థలకు పోలీసులు నోటీసులు ఇచ్చే యోచనలో ఉన్నారు.

మళ్లీ వారి చేతికే..!

మాజీ ఎండీయూల ఆపరేటర్లకు డీలర్ల ఈ-పోస్ యంత్రాలు

కొరిటెపాడులో ఇళ్లకు వెళ్లి వేలిముద్రల సేకరణ

బియ్యానికి బదులు నగదు పంపిణీ

ఆ బియ్యం మాఫియాకి చేరవేస్తున్న డీలర్లు



గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రారంభమై ఆరు రోజులు గడిచినా గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే అట్టడుగు నుంచి రెండో స్థానం(25)లో ఉంది. దీంతో ఎలాగైనా పంపిణీ శాతం పెంచాలన్న లక్ష్యంతో కొంతమంది రేషన్ డీలర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. వాళ్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాలను గతంలో ఎండీయూ ఆపరేటర్లుగా పని చేసిన వాళ్ల చేతికి అందించి.. ఇళ్ల వద్దకు పంపిస్తున్నారు. దీంతో వారు ఇంకా రేషన్ సరుకులు తీసుకెళ్లని వాళ్ల ఇళ్లకు వెళ్లి ఈ-పోస్ యంత్రంపై వేలిముద్ర వేయించి బియ్యానికి బదులు నగదు కేజీకి రూ.13 చొప్పున చేతిలో పెడుతున్నారు. రేషన్ పంపిణీలో పోర్టబిలిటీ తీసుకురావడం, ఈ-పోస్ యంత్రానికి, ఎలక్ట్రానిక్ కాటాకి లింకు తీసేయడంతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు.

వారు, వాళ్ల మనుషులే..

ఎండీయూ వ్యవస్థ ఉన్నప్పుడు కొంతమంది రేషన్ డీలర్లు ఆపరేటర్లను లోబరుచుకొన్నారు. దాంతో డీలర్లే ద్విపాత్రాభినయం చేశారు. డీలర్, ఎండీయూ ఆపరేటర్‌గా వాళ్లు/వాళ్ల మనుషులే ఉండేవారు. ఆ బంధాన్ని నేటికీ కొందరు జిల్లాలో కొనసాగిస్తున్నారు. ఒకపక్క మాజీ ఎండీయూ ఆపరేటర్లు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అలానే వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. అయినప్పటికీ వాళ్లని డీలర్లు దూరం పెట్టడం లేదు. తాజాగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈ-పోస్ యంత్రంతో కొరిటెపాడులో వేలిముద్రలు వేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇంకా అవగాహన లేదు..

కాగా చాలామందికి ఎండీయూ వ్యవస్థ రద్దు అయిందన్న విషయం తెలియదు. తెలిసిన వాళ్లు మాత్రం రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకొంటున్నారు. రద్దు సమాచారం తెలియని వాళ్లు ఎండీయూ వాహనం వస్తుందిలేనని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వాళ్ల వద్దకు ఎప్పటిలానే ఈ-పోస్ యంత్రంతో గతంలో ఎండీయూగా పని చేసిన వ్యక్తి వెళ్లి వేలిముద్ర వేసి నగదు చేతిలో పెట్టేస్తున్నారు. ఈ విధంగా మిగిల్చిన బియ్యాన్ని రేషన్ మాఫియాకి చేరవేసి డీలర్, మాజీ ఎండీయూ ఆపరేటర్ పంచుకొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం పంపిణీ జిల్లాలో తక్కువగా 62 శాతం మాత్రమే ఉండటంతో పైనుంచి డీలర్లపై ఒత్తిళ్లు పెరుగుతుండటమే. వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే సరుకులు పంపిణీ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీనిని వేరే వాళ్లకు కూడా ఉపయోగించి సొమ్ము చేసుకొంటున్నారు.

పోలీసులు వేధిస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పోలీసుల అరాచకాలకు చెక్ పెట్టాలని జగన్‌కు వినతి

సెల్ఫీ వీడియో విడుదల చేసిన వైనం

సోషల్ మీడియాలో వైరల్

వేధించలేదంటూ పోలీసులు, మేనల్లుడి వివరణ

రాజుపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అంటేనే పోలీసులు వేధిస్తున్నారు.. పోలీసుల అరాచకాలు చెక్ పెట్టాలి. జగన్నా నేను బతికుంటానో లేదో తెలియదు కానీ ఈ అరాచకాలకు చెక్ పెట్టన్నా అంటూ పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం నెమలిపురికి చెందిన వైసీపీ కార్యకర్త గుత్తా లక్ష్మీనారాయణ పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించాడు. అతడు ప్రస్తుతం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసి పురుగు మందు తాగి లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు యత్నించాడు.

ఈ వీడియో వైరల్ అయింది. తాను వైసీపీలో ఉండటం వలనే పోలీసులు వేధిస్తున్నారని పేర్కొన్నాడు. కమ్మ వాడివైతే వైసీపీలో ఎలా ఉంటావని డీఎస్పీ తనను బెదిరించాడు.. పోలీసుల అరాచకాలకు చెక్ పెట్టన్నా.. వైసీపీ అంటేనే వేధిస్తున్నారు. నేను చనిపోయాక నా శవాన్ని తాకి పాడె మోయన్నా అంటూ జగన్‌ను అభ్యర్థించాడు. రాష్ట్రంలో మరొకరికి తనలా కాకుడదు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా నా శవాన్ని అయితే నువ్వు మాత్రం పరామర్శించు అన్నా అంటూ వేడుకున్నాడు. వీడియో రిలీజ్ చేసి లక్ష్మీనారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ఆయనను తొలుత పిడుగురాళ్ల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. అయితే వ్యాపారంలో కొంత నష్టం వచ్చిందని కనకరావు, గాంధీ, పెద్దనరసింహారావు, చిన్న నరసింహారావు, రామారావు మరికొంతమంది ఇబ్బంది పెడుతున్నారు. అందుకే తన మామయ్య లక్ష్మీనారాయణకు ఆత్మహత్యాయత్నం చేయాల్సివచ్చింది. దీనిలో ఎవరి ప్రమేయం కానీ, పోలీసుల ప్రమేయం లేదని అతడి మేనల్లుడు విష్ణు తెలిపారు. ఈ మేరకు ఆయన మరో వీడియో రిలీజ్ చేశారు. దీంతో లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నానికి రాజకీయం కారణం కాదని గ్రామస్థులు తెలిపారు. లక్ష్మీనారాయణ వయస్సు 50 ఏళ్లు ఉంటుందని ఆయనకు వివాహం కాలేదని వారు తెలిపారు. లక్ష్మీనారాయణ ఆరోపణలను రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ ఖండించారు. అయన ఎప్పుడు పోలీసు స్టేషన్‌కు రాలేదని చెప్పారు.

ఉచిత బస్సు హామీని విరమించుకోవాలి

గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు హామీని తక్షణమే విరమించుకోవాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ హామీ అమల్లోకి వస్తే లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, ఏడాదికి రూ 15వేలు, 21, 31 జీవోలను రద్దు చేస్తానని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జిల్లాలో గ్యాస్ ఆటోలు పెరిగాయని దీనిని దృష్టిలో పెట్టుకుని గ్యాస్ కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు ఎండి బాబర్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగా శ్రీనివాస్, పాల్గొన్న యూనియన్ నాయకులు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

కొవిడ్-19 వైద్యసేవలను వినియోగించుకోండి

గుంటూరు మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొవిడ్-19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్యం ఉచితంగా అందజేస్తున్నామని, అనుమానితులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి తెలిపారు. రోగుల సమస్యలను తెలుసుకుంటూ ప్రతి శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే వారు తప్పనిసరిగా మాస్కు ధరించి రావాలని ఆయన కోరారు. జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ అనిల్ కుమార్ రోగులను ఉద్దేశించి మాట్లాడుతూ కొవిడ్ విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కొవిడ్ అనుమానిత లక్షణాలతో బాధపడే వారు వ్యాధి నిర్ధారణపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురువైద్యులు, పాలన అధికారులు పాల్గొన్నారు.

గత పాపం.. అన్నదాతకు శాపం

(5వ పేజీ తరువాయి)

ఆర్‌టీజీఎస్ ద్వారా సమగ్ర పరిశీలన చేపట్టిన తర్వాతే తుది జాబితా ఖరారు చేయనుందని తెలుస్తోంది. 21,900 వరకు వివిధ కారణాలతో తిరస్కరణకు గురికాగా 22,714 మంది రైతుల రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ పడ్డాయి. గుంటూరు జిల్లాలో ఈ సంఖ్య దాదాపు 18 వేల వరకు ఉండగా, పల్నాడులో 27 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి భూ రికార్డులు ఆన్‌లైన్‌లో తప్పుల తడకగా ఉండడమో లేక నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయకపోవడం వల్లనే చిక్కులు తలెత్తాయి.

అస్తవ్యస్త రీసర్వే ఫలితమే...

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి వేల సంఖ్యలో అన్నదాతలు దూరం అయ్యే పరిస్థితి వైసీపీ రీసర్వే ఫలితమేనని రెవెన్యూ చిక్కులు చెబుతున్నాయి. గత ప్రభుత్వం సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం ప్రవేశపెట్టడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. రీసర్వే ప్రక్రియలో ఓ గ్రూపుగా ఎంపిక చేసి.. వారికి ఎల్‌పీఎం నంబరు కేటాయించి అదే ఘనతగా చెప్పుకున్నారు. వెబ్ ల్యాండ్ డేటా మొదలుకుని ఆధార్ సీడింగ్, పేరు తప్పుగా నమోదు చేయడం వంటి సాంకేతిక తప్పిదాలు కోకొల్లలు. పెండింగ్‌లో ఉంచిన రికార్డుల్లో 70 శాతం గత ప్రభుత్వ రీసర్వే తప్పిదాలేనని అధికారులే ఒప్పుకోవడం గమనార్హం. వీటిని తిరస్కరణ కింద చూపెడితే రైతులు ప్రశ్నిస్తారని, అలా అని అర్హుల జాబితాలో చేర్చడానికి నిబంధనలు ప్రతిబంధకంగా మారాయని యంత్రాంగం చెబుతోంది.

తమ ప్రమేయం లేకుండానే

ఆన్‌లైన్‌లో రికార్డులు తప్పుగా చూపించడం వెనక తాము చేసిందేమి లేదని రైతులు చెబుతున్నారు. అన్నీ పక్కాగా ఉన్నప్పటికీ తప్పుగా నమోదు చేశారని వారు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగానే తప్పుగా నమోదు చేసినట్లు అన్నదాతలు చెబుతున్నారు. వీటి విషయంలో ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడం సాధ్యపడదని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. మరో వైపు అన్నదాత సుఖీభవ పథకం తుది జాబితా ఈ నెల మొదటి వారంలో ఖరారు చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉండడంతో.. గత ప్రభుత్వం చేసిన తప్పుకు తాము పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల కార్మికుల సమాచారం తెలపండి

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దుకాణాలు, హోటల్స్, కర్మాగారాలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న 18 ఏళ్ల లోపు బాల కార్మికుల సమాచారం ఇవ్వాలని ప్రజలను ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి ఒక ప్రకటనలో కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తిస్తే 94925 555157, 94925 55144 నంబర్లుకు సమాచారం తెలపాలని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లో 25 లక్షలు దాటిన ఓపీ

మంగళగిరి సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో ఓపీ సేవలు 25 లక్షల మైలురాయిని చేరినట్టు ఆస్పత్రి వర్గాలు శుక్రవారం తెలిపాయి. అయిదు సంవత్సరాల క్రితమే ఎయిమ్స్‌లో వైద్య సేవలు ప్రారంభించగా, అనతి కాలంలోనే ఈ ఘనత సాధించడం గర్వంగా వుందని పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రజల ఆరోగ్య సంరక్షణా అవసరాలను వృత్తి నైపుణ్యంతో తీర్చేందుకు అనేక విభాగాలు, వైద్య బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

83 వృక్షాలకు స్థల మార్పిడి

మంగళగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకానిలో పాత కేన్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణానికి 83 వృక్షాలు అడ్డుగా ఉన్నాయి. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆ వృక్షాలను కొట్టివేయకుండా వేరేచోట ఏర్పాటు చేశారు. అధునాతన పరిజ్ఞానంతో ట్రీ ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో నగరంలోని పలు ప్రాంతాల్లో వృక్షాలను ఏర్పాటు చేసి జీవం పోశారు.



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ చినవెంకటేశ్వర్లు, శిక్షకులు

ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాల కౌన్సెలింగ్ శుక్రవారం తెనాలి ఐటీఐలో ప్రారంభం అయ్యింది. జిల్లాలోని వివిధ ఐటీఐలలో 298 మంది విద్యార్థులు మొదటి విడత దరఖాస్తు చేశారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కళాశాల ట్రేడ్‌లను కేటాయించారు. జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఇమ్మానుయేలు, శిక్షకులు పర్యవేక్షించారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా చెన్నయ్య

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ గుంటూరు డిప్యూటీ డైరెక్టర్‌గా యూ చెన్నయ్యను నియమిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నయ్య ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో డీఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్నారు. మరో రెండుమూడు రోజుల్లో ఆయన గుంటూరులో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది వెల్లడించారు. ఇప్పటి వరకు సెలవులో ఉన్న గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ డీ మధుసూదన్‌రావును రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా.. శ్రీకాకుళం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై ఉన్న ఆరోపణలు, విజిలెన్స్ విచారణ తదితర అంశాలపై త్వరలో ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు చెబుతున్నారు.

రాయగడ, కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌లకి

పెరిగిన ఏసీ త్రీటైర్, స్లీపర్ బోగీల సంఖ్య

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాయగడ, కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌లకి ఈ నెల 18, 19 తేదీల నుంచి ఏసీ త్రీటైర్, స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్య పెరగనుంది. ఈ మేరకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకొన్నది. ఆయా తేదీల నుంచి ఈ రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన 2 ఏసీ త్రీటైర్, 13 స్లీపర్, ఐదు జనరల్, 2 బ్రేక్ వ్యాన్‌లుంటాయి. అలానే సమ్మర్ స్పెషల్ ట్రైన్‌గా నడుపుతున్న చర్లపల్లి - బ్రహ్మపూర్, బ్రహ్మపూర్ - చర్లపల్లి రైళ్లకు కూడా ఒక అదనపు ఏసీ త్రీటైర్ బోగీని రైల్వే శాఖ మంజూరు చేసింది. దీంతో ఏసీ త్రీటైర్ బోగీల సంఖ్య ఈ రైలుకు మూడుకు పెరిగాయి.

సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్)గా కే శ్రీనివాస్

గుంటూరు రైల్వే డివిజన్‌లో కీలకమైన సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్)గా గుంతకల్లులో విధులు నిర్వహిస్తున్న కే శ్రీనివాస్‌ని దక్షిణ మధ్య రైల్వే నియమించింది. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జేవీ అనూషని ఉత్తర రైల్వేలకు బదిలీ చేసింది. అలానే సీనియర్ డీఈఈ జీ సూర్యనారాయణ సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. సీనియర్ డీఈఈ/టీఆర్ పీ రవితేజని టీఆర్‌ఎస్‌వోకి బదిలీ చేశారు. నాందేడ్ నుంచి ఏ రవితేజని గుంటూరు డివిజన్‌కు బదిలీ చేశారు.

వచ్చే నెలలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలు గుంటూరులో జులై 23, 24 తేదీల్లో జరగనున్నాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వి నరసింహారావు తెలిపారు. శుక్రవారం పాతగుంటూరు, సీ ఐ టీ యూ కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలకు ఆహ్వాన సంఘ చైర్మన్‌గా, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, అధ్యక్షుడుగా పెరవలి నాగ వంశీ వ్యవహరిస్తారని అన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అనేకమంది ప్రముఖులను కమిటీలోకి ఆహ్వానించడం జరిగిందని చెప్పారు. మహాసభల్లో నిర్మాణ రంగంలో వస్తున్న సమస్యలను, పరిష్కారం మార్గాలను చర్చించి భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

పోల్ టెండర్లలో.. కిరికిరి

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేస్తారని దరఖాస్తుదారులు ఆశించారు. అయితే ఈ ప్రక్రియను పక్కన పడేసినట్లు సమాచారం. పోల్ సెంటర్‌ను టెండర్‌దారులకు కాకుండా పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ ప్రాంతానికి చెందిన మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిసింది. విశేషమేమిటంటే ఆ వ్యక్తి అసలు టెండరే వేయలేదు. పైగా తగిన అనుభవం కూడా లేదు. కానీ అనర్హుడికి పోల్‌సెంటర్‌ను కట్టబెడుతున్నారనే విషయం వెలుగుచూడటంతో టెండర్ వేసిన వారు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. టెండర్లు ఎప్పుడు పిలిచారు.. ఎంత మంది పాల్గొన్నారు..

ఎవరెవరు పాల్గొన్నారు.. ఇప్పటి వరకు ఎందుకు ఖరారు చేయలేదు.. వంటి సమాచారాన్ని కోరుతూ సమాచార హక్కు ద్వారా విద్యుత్‌శాఖకు టెండర్ దారులు దరఖాస్తు చేశారు. అనర్హుడికి పోల్ సెంటర్‌ను కట్టబెట్టాలనే ఆలోచనకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దరఖాస్తుదారులు కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నారని తెలిసింది.

దర ఖాస్తుదారుల్లో టీడీపీకి చెంది న వారు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతిని ధులకు టెండరలో కిరికిరి గురించి చెప్పి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



దోకిపర్రు పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

పొగాకు వేలం కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

గుంటూరు సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక ఆదేశాల మేరకు జిల్లాలోని పొగాకు వేలం కేంద్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆ మేరకు పేరేచర్ల సమీపంలోని డోకిపర్రు పొగాకు వేలం కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. సదరు కేంద్రంలో ఇప్పటివరకు 25 లక్షల కిలోల తెల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు బయ్యర్లు తెలిపారు. రెండు లక్షల కిలోల నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఉత్పత్తులు, నాణ్యత బట్టి కిలో రూ.40 నుంచి రూ.120 వరకు వెచ్చించి కొనుగోళ్లు జరుగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు నెలల్లో రైతుల వద్ద నున్న మొత్తం నిల్వలను కొనుగోలు చేయాలని రైతులు జిల్లా వ్యవసాయ అధికారికి విజ్ఞప్తి చేశారు.

ప్రవేశాలు నిరాకరిస్తే యాజమాన్యాలపై చర్యలు

● సమగ్ర శిక్ష ఏపీవో పద్మావతి

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ద్వారా సీట్లు పొందిన విద్యార్థులను నిర్దేశించిన పాఠశాలల్లో చేర్పించేలా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీవో పద్మావతి స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయంలోగా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆయా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. పాఠశాలల యాజమాన్యం ఏవైనా ఆటంకాలు కల్పిస్తే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఎటువంటి ఫీజు చెల్లించరాదని , పాఠశాల యాజమాన్యాలు ఫీజు చెల్లింపు చేయాలని డిమాండ్ చేస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా హక్కు చట్టం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 10లోగా పాఠశాలల్లో చేరాలని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యలు ఉన్న సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

పోరాటాల యోధుడు.. చంద్ర రాజేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు అనేక ఉద్యమాలు చేసిన పోరాటాల యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. స్థానిక కృష్ణానగర్‌లో శుక్రవారం జరిగిన చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అణగారిన వర్గాల కోసం యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని గుర్తు చేసుకున్నారు. చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, గని, రత్నకుమార్, అకిటి అరుణ్ కుమార్, అకిటి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

రెల్లి కులస్తుల సమస్యలను పరిష్కరిస్తాం

● గాదెకు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హామీ

గుంటూరు మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధి 11వ డివిజన్‌లోని ఆనందపేటలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు శుక్రవారం పర్యటించారు. ఆనందపేట రెండో లైన్‌లో కొన్నేళ్లుగా నివసిస్తున్న రెల్లి కులస్తులు దీర్ఘకాలంగా పలు సమస్యలతో సతమతంఅవుతున్నారు. రెల్లికులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను జనసేన నేతలు గుండ్రెడ్డి అనిల్, బుజ్జిబాబు, కిషోర్ తదితరులు గాదె వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలసి గాదె స్థానికంగా పర్యటించి రెల్లిలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెల్లి కులస్తులతో కలసి ఆయన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌ను కలిశారు. వారి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై నసీర్ అహ్మద్ స్పందిస్తూ రెల్లికులస్తుల సమస్యలకు త్వరలో పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు.




ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో చర్చిస్తున్న గాదె వెంకటేశ్వరరావు

ఎన్‌హెచ్-16కి ర్యాంపుల మంజూరుకు కృతజ్ఞతలు

● విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి సత్యనారాయణ

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-16కి పెదకాకాని వద్ద ఇరువైపులా ర్యాంపులు మంజూరు చేసినందుకు జేకేసీ కళాశాల రోడ్డులో నివసించే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పీ.సత్యనారాయణ శుక్రవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కాలంలో ఈ రోడ్డులో 109 ప్రమాదాలు జరగగా వాటిల్లో 106 మంది తీవ్రంగా, 29 మందికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాల డ్రైవింగ్‌ని నిరోధించేందుకు తాము సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. అలానే రోడ్డు ప్రమాదాల గణాంకాలను సేకరించి ఎన్‌హెచ్ఐఏ అధికారులకు కూడా పంపించామన్నారు వీటన్నింటికి కేంద్ర ప్రభుత్వం స్పందించి రూ.9.59 కోట్ల నిధులను ఎన్‌హెచ్ఏఐకి మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ర్యాంపుల పనులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

గుంటూరు(తూర్పు), జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్న మయ్య కళావేదికపై బండ్లమూడి విజయ లక్ష్మి సౌజన్యంతో మూడు రోజులుగా శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తియోగంపై జరుగుతున్న ప్రవచనాలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు ప్రవచనాలను ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనాన్ని ప్రారంభిస్తూ ఈ జగత్తులో నశ్వరుడు, అక్షరుడు అని పురుషులు రెండు విధాలని, సకల ప్రాణుల శరీరములు నశ్వరములని, జీవాత్మ నాశరహితుడు అని అన్నారు. పై ఇద్దరికంటె ఉత్తముడైన పురుషుడు నాశరహితుడైన పరమేశ్వరుడు పరమాత్మ అన్నారు. నశ్వరమగు క్షేత్రము కంటె నేను సర్వథా అతీతుడన్నారు. నాశరహితమైన జీవాత్మ కంటే ఉత్తముడనని కనుక ఈ జగత్తు, వేదములలో పురుషోత్తముడిగా ప్రసిద్ధి పొందాయని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి తెలియజేశారన్నారు.

నల్లచెరువులో దాహం.. దాహం

● రెండు రోజుల పాటు నిలిచిన తాగునీటి సరఫరా

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువు ఓవర్‌హెడ్ ట్యాంకు పరిధిలోని ప్రాంతాలకు రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసే మోటారు మొరాయించడంతో ట్యాంకుకు నీళ్లు ఎక్కలేదు. దానిని మరమ్మతులు చేసేందుకు ఎక్కువ సమయం పట్టడంతో మండు వేసవిలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరపాలకసంస్థ అధికారులపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో శుక్రవారం ఉదయం అప్పటికప్పుడు విజయవాడ నుంచి తాత్కాలిక మోటారు తీసుకొచ్చి అమర్చి నీటి పంపింగ్‌ని ప్రారంభించారు. సాయంత్రానికి ట్యాంకులోకి నీటి సరఫరా చేసేందుకు అవసరమైన లెవల్‌కు ఎక్కడంతో కొద్దిసేపు సప్లై ఇచ్చారు. శనివారం నుంచి యథాతథంగా తాగునీటి సరఫరా చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కాగా తాగునీటి సరఫరా జరగదన్న విషయాన్ని ప్రజలకు చెప్పడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఇదే సమయంలో కనీసం ట్యాంకుల ద్వారానైనా ప్రజలు ఇబ్బంది పడకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకోలేదు. శుక్రవారం విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వాళ్లు నల్లచెరువు రిజర్వాయర్ పంపుహౌస్‌ని సందర్శించి అప్పటికప్పుడు విజయవాడ నుంచి తాత్కాలిక ప్రాతిపదికన మోటారు తెప్పించి పంపింగ్‌ని మొదలు పెట్టించారు. లేకుంటే వరుసగా మూడో రోజు శుక్రవారం కూడా ప్రజలకు నీటి సరఫరా జరిగేది కాదు. మరోవైపు ప్రజలు చాలామంది శుక్రవారం ఓవర్‌హెడ్ ట్యాంకు వద్దకు బిందెలు, బక్కెట్‌లు తీసుకొని వచ్చి తాగునీటిని పట్టుకెళ్లారు.



ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద నుంచి బిందెలు, బక్కెట్లతో నీటిని తీసుకెళుతున్న ప్రజలు



బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయ అధికారులు

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

గుంటూరు(తూర్పు), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని గ్రంథాలయ శాఖలో 40 రోజుల నుంచి జరిగిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర 2047 అంశంపై వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు, తెలుగు పద్యాలు, ఆటలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విద్య ఫౌండేషన్ అధ్యక్షుడు వీబీ ప్రసాద్ లింగం, ఎం.అరవింద చేతుల మీదగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్యశిరిష, సిబ్బంది పి.కోటేశ్వరి, పి.సుధాకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలో...

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నెల రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. గ్రంథాలయ అధికారి వంకదారి సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లిష, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్‌క్రాఫ్ట్, చెస్, క్యారమ్స్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టారు, గుళ్ళపల్లి సుబ్బారావు , వీబీ ప్రసాద్ లింగం, కేవీ రమణ, ఏవీకే సూజాత, కె. ఝాన్సీలక్ష్మి, ఉప గ్రంథ పాలకురాలు, కార్యాలయ సిబ్బంది, కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

భక్తి శ్రద్ధలతో గరుడ ప్రసాద వితరణ



ప్రసాద వితరణ చేస్తున్న వేద పండితులు

గుంటూరు (తూర్పు), జూన్ 6(ఆంధ్ర జ్యోతి): స్థానిక కృష్ణానగర్, శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, విశేష పూజల అనంతరం వైభవంగా ధ్వజారోహణ చేశారు. ప్రత్యేకంగా సంతానార్థులైన మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందించారు. సాయంత్రం శ్రీ వేంకటేశ్వర సహస్రనామ స్తోత్ర పారాయణ, ఎదుర్కోలు సన్నాహం, రాయబారం కనుల పండువగా జరిగాయి. కార్యక్రమాల్ని ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

గోవుల అక్రమ రవాణాపై పోలీసుల తనిఖీలు

● చుట్టుగుంట సెంటర్‌లో వాహనాల సోదాలు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవధను నిషేధిస్తూ గోవుల అక్రమ రవాణా జరగకుండా పోలీసులు దృష్టి సారించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నగరంపాలెం ఎస్ఐ ప్రసన్నకుమార్ నేతృత్వంలో చుట్టుగుంట సెంటర్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారి నుంచి నగరంలోకి రాకపోకలు సాగించే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనుమానాస్పదంగా రాకపోకలు సాగిస్తోన్న వాహనాలను నిలిపి తనిఖీలు చేశారు. అటుగా రాకపోకలు సాగిస్తున్న లారీలు, జీపులు, ఇతర భారీ వాహనాలను సోదాలు చేసి పంపివేశారు. శనివారం కూడా తనిఖీలు జరుగుతాయన్నారు. గోవధ చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా గోవధపై సమాచారముంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



చుట్టుగుంట సెంటర్‌లో లారీలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రామిరెడ్డినగర్‌లో యువతి అదృశ్యం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామిరెడ్డినగర్‌కు చెందిన సమీరా అనే యువతి అదృశ్యమైంది. ఆమె తండ్రి సయ్యద్ జమీర్ ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తుంటాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఈనెల 5న కూతురు సమీర ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీడీసీఎంఎస్ అభ్యున్నతికి సహకారం అందించాలి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు

గుంటూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజను చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు కోరారు. జీడీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిబాబు శుక్రవారం కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. జీడీసీఎంఎస్ ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చే పలు అంశాలపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, ఆఫీస్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులున్నారు.



ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు నాయుడు తదితరులు

క్యాన్సర్‌పై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేడు ప్రపంచవ్యాప్తంగా వణికిస్తోన్న క్యాన్సర్‌పై అరండల్‌పేట 15/1వ లైనులోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ టి మహతి ప్రధాన వక్తగా హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. క్యాన్సర్ గుర్తింపు, నివారణ, చికిత్సల గురించి ఆమె అవగాహన కల్పించటంతో పాటు సందేహాలను నివృత్తి చేస్తారన్నారు.

నేడు నగరానికి కన్నప్ప చిత్ర యూనిట్

● వేంకటేశ్వర విజ్ఞానంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కన్నప్ప చిత్ర యూనిట్ శనివారం నగరానికి రానుంది. కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్‌ను దృష్టిలో ఉంచుకొని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సినీ నటులు మంచు మోహన్ బాబు, ఆయన తనయుడు విష్ణు, ప్రభుదేవా, బ్రహ్మానందంతోపాటు పలువురు చిత్ర యూనిట్ ఈ కార్యక్రమానికి హాజరుకానుంది. వీరు ఏసీ కళాశాల వద్ద బస్సు దిగి అక్కడ నుంచి నడుచుకుంటూ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు రానున్నారు. అయితే ఈ సినిమాలో బ్రాహ్మణుల మనోభావాలు కించపరిచేలా సన్నివేశాలు చిత్రీకరించారని బ్రాహ్మణ సంఘం నాయకుడు సిరిపురపు శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం నగరానికి రానున్న కన్నప్ప చిత్ర యూనిట్‌కు శంకర్‌విలాస్‌లో ధర్నా నిర్వహించి నిరసన తెలియజేస్తామని తెలిపారు. కాగా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అదేవిధంగా ట్రాఫిక్ ఇబ్బందులు వంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లను ఎస్పీ సతీష్ కుమార్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తు ఏర్పాట్లను కొత్తపేట సీఐ చౌదరిని ఎస్పీ ఆదేశించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

బంగారం చోరీ చేసిన కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ ఆరోగ్యరాజు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్ లో ఒక కళ్యాణ మండపంలో చోరీ కేసులో మిస్టరీ ఛేదించారు. ఈ మేరకు శుక్రవారం వెస్ట్ డీఎస్పీ అరవింద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన మూల్పూరి హనుమంతరావు దంపతులు గత నెల 11న అమరావతి రోడ్డులో గల విజయం కళ్యాణ మండపంలో ఆయన మేనల్లుడు వివాహానికి వచ్చారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న నగల బ్యాగును వరుడు గదిలో పెట్టారు. కొద్ది సమయం తర్వాత ఆ గదిలో పరిశీలించగా బ్యాగ్ కనిపించలేదు. కాగా ఈ ఘటనపై ఈనెల 4న బాధితుడు హనుమంతరావు అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన గుంజి గోవిందుగా గుర్తించారు. గోవిందును అదుపులోకి తీసుకొని ఆయన చోరీ చేసిన ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు కళ్యాణ మండపం జరుగుతున్న పెళ్లిలో భోజనం చేసేందుకు వచ్చాడు. వరుడి గదిలో బ్యాగు కనిపించడంతో అవకాశం దొరకడంతో బ్యాగు అపహరించుకుపోయాడు. అందులో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకొని వచ్చిన సొమ్ముతో తన ద్విచక్ర వాహనం ఈఎంఐలు కట్టాడు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు, సిబ్బంది బ్రాడీపేటలో నిందితుడు గోవిందును అదుపులోకి తీసుకొని ఆయన నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు కొందరు తమ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీలక్ష్మి నగర్, ఉద్యోగ నగర్‌లో సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించాలని, గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యోగ నగర్ కాలనీ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న రజక వృత్తిదారుల కోసం శుభకార్యాలు చేసుకోవటా నికి 'కమ్యూనిటీ హాల్' నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను హెల్త్ ప్రొవైడర్లుగా గుర్తిస్తూ జీవో నెంబర్ 46ను పునరుద్ధరించాలని పలువురు వినతిపత్రం అందించారు. వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ప్రజా దర్బార్

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి వారధిగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, మురుగునీరు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించి ఎక్కువ వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తామని, వెంటనే అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అర్హతను బట్టి మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమస్యలు ఉంటే తనను ఎప్పుడైనా కలవవచ్చని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం 10 నెలల కాలంలోనే సీసీ డ్రెయిన్లు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వివిధ కారణాలను అడ్డుపెట్టి పింఛన్లకు ఎసరు పెట్టారని, రేషన్ కార్డులు తీసేశారని ఆయన ఆరోపించారు. అర్హత ఉన్న వారందరికీ తిరిగి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గోళ్ల ప్రభాకర్, హఫీజ్, సలీం, ఆంజనేయ ప్రసాద్, కందుకూరి వెంకట్, వంగర ఏడుకొండలు, అల్లం బాజీ, బ్రహ్మసాని శ్రీనివాసరావు, ప్రభాకర్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

దయ, త్యాగం, సమానత్వానికి ప్రతీక బక్రీద్ : నసీర్

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దయ, త్యాగం, సమానత్వానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ముస్లింలంతా సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే నసీర్ ఆకాంక్షించారు. బక్రీద్ పండగ సందర్భంగా శుక్రవారం ఆయన ఈద్గాలను పరిశీలించారు. పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింలకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. మంచినీటి సదుపాయం, టెంట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

8న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట 3/1 లోని హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో ఈనెల 8న ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరం పోస్టల్ శుక్రవారం ఆవిష్కరించారు. చికిత్స శిబిరంలో కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, నీటికాసులు, దగ్గర, దూర దృష్టిలోపం, పొడి కన్నులు, కండ్ల కళకలు చికిత్సలతో పాటు కీళ్లవాతం, వెన్నెముక సంబంధిత జ్ఞాపకశక్తి, వెన్ను నరాల, ఉబ్బిన నరాలకు ఈ వైద్య శిబిరంలో సేవలందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సీతారామయ్య, హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టి.శివశంకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయికుమార్ పాల్గొన్నారు.

10న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 10న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌లో జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్ల దాటిన బాల, బాలికలు పోటీలకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి ఏఎన్‌యూలో జరిగే ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అదే రోజు ఉదయం యూనివర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో రిపోర్టు చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు జంబో కూలర్లు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండుటెండలతో విలవిల్లాడుతోన్న ప్రయాణికులకు ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో జంబో కూలర్లు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్ నేతృత్వంలో బస్టాండ్‌లోని ప్రయాణికులు వేసవి నుంచి ఉపశమనం పొందేలా జంబో కూలర్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికు లు కూడా కూలర్లతో సేద తీరుతున్నారు. వేసవి వరకు కూలర్లు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

కార్మిక చట్టాల మార్పు హేయం

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హేయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం శంకర్‌విలాస్ సెంటర్లో ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పని గంటలు 8 నుంచి 10 గంటలకు పెంచటం, మహిళా కార్మికులతో పని చేయించుకునే విధంగా మార్పు చేయటం, ఓవర్ టైమ్‌ను పెంచటం వంటి మార్పులను చేసిందని అన్నారు. మధ్య తరగతి ఉద్యోగుల సమన్వయ కమిటి కన్వీనర్ వీవీకే సురేష్ మాట్లాడుతూ మోదీ తీసుకువస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని అన్నారు. తక్షణమే ఈ చట్టాలను ఉపసంహరించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసనల్లో బి.ముత్యాలరావు, ఎ.కళ్యాణి, షేక్ అబ్దుల్ సలీం, జి.రమణ బి. సత్యనారాయణ, గండికోట శంకరరావు పాల్గొన్నారు.



నిరసనల్లో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

బడ్జెట్‌లో బ్రహ్మాండంగా..

కుటుంబ వేడుకలకు కొత్త ట్రెండ్



● విస్తరిస్తున్న మినీ థియేటర్ల సంస్కృతి
● వెండి తెరలు, అద్భుతమైన బ్యాక్‌డ్రాప్‌లు
● అడుగు పెడుతూనే కొత్త ప్రపంచం ఆవిష్కృతం
● కేక్, బెవరేజస్, ఫుడ్ ఐటెంలు ఆర్డర్‌పై సరఫరా
● తక్కువ ఖర్చుతో.. అత్యధిక ఆనందం



గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉంటుంది. ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకొని అతిథులను పిలిచి చేసుకో వాలంటే ఖర్చు తడిసి మోపడంత అవుతుంది. ఒకవేళ రెస్టారెంట్లకు వెళ్లినా అక్కడ కేవలం కేక్ కటింగ్‌కు మాత్రమే డైనింగ్ టేబుల్‌పై అనుమతిస్తారు. ఇంట్లో చేసుకో వాలంటే డెకరేషన్‌కు చాలా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ గ్యాప్‌ని కవర్ చేసేందుకు.. కొంతమంది వ్యాపారులు మినీ థియేటర్లను గుంటూ రులో పలుచోట్ల ఏర్పాటు చేశారు. వాటిల్లో బర్త్‌డే, యానివర్సరీలు వం టివి చేసుకోవ డానికి రూ. 3 వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. నలుగురు సభ్యులకు రూ. 2,400, ఆ తర్వాత ప్రతీ అదనపు కుటుంబ సభ్యుడికి రూ.250 చొప్పున చార్జ్ చేస్తారు. గుంటూరు నగరంలో బ్రాడీపేట, జీటీ రోడ్డు, పలకలూరు రోడ్డు వంటి ప్రాంతాల్లో ఈ మినీ థియేటర్లు చిన్న చిన్న ఫంక్షన్లకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి.

థియేటర్‌ని తలదన్నేలా

మినీ థియేటర్‌లోకి అడుగు పెడుతూనే ప్రజలు కొత్త అనుభూతిని పొందుతున్నారు. లోపల పెద్ద థియేటర్ స్క్రీన్, డాల్బీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటుంది. స్క్రీన్ సైజులు 135 నుంచి 180 అంగుళాలు, సౌండ్ 600 వాట్స్ నుంచి వెయ్యి వాట్స్ వరకు ఉంటున్నాయి. ఫాగ్ ఎంట్రీలు కూడా కొన్ని థియేటర్లలో ఉంటున్నాయి. ఫొటో షూట్ కావాలన్నా ఏర్పాటు చేస్తున్నారు. లోపల సినిమా సెట్‌ని తలదన్నేలా ఫాగ్ ఉంటుంది. అలానే సినిమా థియేటర్ తరహాలో సోఫాసీట్లు ఏర్పాటు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఎల్‌ఈడీ లైటింగ్‌ని అలంకరించారు. కేక్‌లు కట్ చేసుకోవడానికి ఒక చిన్న వేదిక ఉంటుంది. అలానే వెనక ఫంక్షన్‌ను ప్రతిబింబించేలా డెకరేషన్, లైటింగ్ ఏర్పాటు చేస్తారు. అక్కడ ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. అలానే థియేటర్ బయట కూడా మంచి బ్యాక్‌డ్రాప్‌లు ఏర్పాటు చేశారు. 16 డిగ్రీల సెల్సియస్‌తో శీతల వాతావరణాన్ని లోపల ఉండేలా మెయిన్‌టెయిన్ చేస్తున్నారు. దీంతో వేసవిలో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అలానే ఆశ్చర్యపోయేలా డెకరేషన్స్ ఉంటున్నాయి.



ఇష్టమైన సినిమా, షోలను వీక్షిస్తూ



మినీ థియేటర్ లోపల డాల్బీ సౌండ్ సిస్టంతో.. ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అందులో ఇష్టమైన సినిమా, టీవీ షోలను వీక్షిస్తూ ఆస్వాదించొచ్చు. కొందరైతే గతంలో రికార్డ్ చేసిన ఫంక్షన్ల పెన్‌డ్రైవ్‌లు తీసుకొచ్చి వాటిని ప్రదర్శించుకొంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ ఆనందం పొందుతున్నారు. స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటెంలు, బేవరేజస్ తెప్పించుకొని సెల్ఫ్ సర్వ్ చేసుకొంటూ సంతోషంగా గడుపుతున్నారు.

అడ్వాన్స్ బుకింగ్..

ఈ మినీ థియేటర్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. కోరుకున్న ఫుడ్ ఐటెంలను సొంతంగా తయారు చేసుకుని తీసుకెళ్లొచ్చు. ఫుడ్ డెలివరీ చేసే సంస్థలకు ఆర్డర్లు పెట్టుకోవచ్చు. మినీ థియేటర్ల యాజమాన్యాలకు చెప్పినా వాళ్లు తెప్పించి బిల్లులో వాటిని జత చేస్తారు.

కౌలుపై కలవరం!

● మే ముగిసినా ప్రారంభం కాని రాజధాని రైతుల కౌలు ప్రక్రియ
● గత ఐదేళ్లూ నరకం చూసిన రైతులు
● కూటమి ప్రభుత్వం వచ్చాక కౌలు దక్కడంతో సంతృప్తి
● పదకొండో ఏడాది కౌలు ఊసే లేకపోవడంతో మళ్లీ ఆందోళన

రాజధాని రైతుల్లో కౌలు కలవరం మళ్లీ మొదలయిందా అంటే అవుననే సమాధానమే వస్తోంది. మే నెల ముగిసినా కౌలు అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడం, కౌలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలవుతోంది. గత ఐదేళ్లలో అనుభవించిన కౌలు కష్టాల నేపథ్యంలో ఈ ఏడాది కౌలు ప్రస్తావన కూడా లేకపోవడం కలవరపాటుకు కారణం.

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం కోసం అవసరమైన భూములను అమరావతి పరిధిలోని 29 గ్రామాలకు చెందిన 28,800 మంది రైతులు భూ సమీకరణ కింద ఇచ్చారు. అందుకుగానూ పదేళ్లపాటు ఏటా 10 శాతం వార్షిక కౌలు రేటు పెంచి రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం ఏటా మే నెలాఖరునాటికి రైతులకు కౌలు చెల్లించాలి. అయితే వివిధ కారణాలతో ఈ పదేళ్లలో రెండు వేల మందికి పైగా రైతులు అనర్హులయ్యారు. ప్రస్తుతం 26,500 మంది రైతులకు కౌలు చెల్లించాల్సి ఉంది. పోయిన మే నెలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం గడువు పూర్తయింది. రైతుల డిమాండ్ మేరకు ప్రస్తుత ప్రభుత్వం కౌలు గడువున మరో ఐదేళ్లు పొడిగిస్తూ పోయిన సెప్టెంబరులో జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఈ మే నెలలో రైతులకు పదకొండో ఏడాది వార్షిక కౌలు అందాలి. కానీ ఇప్పటి వరకూ అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్ల భయం..

వైసీపీ పాలన సాగించిన ఐదేళ్లలో రాజధాని రైతులు నిత్య నరకం అనుభవించారు. చట్టబద్ధంగా రావాల్సిన కౌలును సైతం



ఆపి గత ప్రభుత్వం వేధించింది. దీంతో న్యాయం కోసం పోరాడాల్సి వచ్చింది. రైతులు పదే పదే కోర్టు మెట్లు ఎక్కారు. తొలి రెండేళ్లలో కోర్టు అక్షింతల అనంతరం కౌలు చెల్లించిన గత ప్రభుత్వం ఆ తర్వాత కౌలును పూర్తిగా ఎగవేసింది. అసైన్డ్ రైతులకు మూడేళ్లపాటు, సాధారణ రైతులకు రెండేళ్లపాటు కౌలు పూర్తిగా నిలిపివేసింది. రైతులు కోర్టు తలుపులు తట్టినా, న్యాయస్థానాలు హెచ్చరించినా ఆ ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. ఫలితంగా రైతులకు కౌలు దక్కలేదు. దీంతో సాధారణ రైతులు ఆకలి, అప్పులతో అల్లాడిపోయారు. పిల్లల చదువులు అర్ధంతరంగా ఆపేసుకున్నారు. కౌలుపైనే ఆధారపడిన అలాంటి రైతులు గత అనుభవాల రీత్యా కలవరం చెందుతున్నారు.

రెండు విడతల బకాయిల చెల్లింపు

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే కూటమి ప్రభుత్వం తొమ్మిదో ఏడాది కౌలు చెల్లింపులకు రూ.190 కోట్లు విడుదల చేసింది. మెట్ట రైతులకు ఎకరానికి రూ.54వేలు, జరీబు రైతులకు రూ.95వేల చొప్పున వార్షిక కౌలు రైతులకు అందించింది. కాగా పదో విడత కౌలు నిమిత్తం రూ.255 కోట్లు ఈ ఏడాది సంక్రాంతి పండుగ రోజున చెల్లించింది. ఈ మే నెలలో రైతులకు పదకొండో ఏడాది కౌలు అందాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ సీఆర్డీఏ కౌలు లెక్కింపు ప్రక్రియ కూడా ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. కనీసం కౌలుకు సంబంధించిన ప్రకటన కూడా ప్రభుత్వం వైపు నుంచి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కౌలు పైనే ఆధారపడే సాధారణ కుటుంబాలు మరింత భయపడుతున్నాయి.

క్షయ రహిత సమాజం దిశగా

టీబీ ముక్తి భారత్ పేరుతో ప్రణాళిక



సత్తెనపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని పారద్రోలడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తోంది. టీబీ ముక్తి భారత్ నినాదంతో వ్యాధి నుండి ప్రజలను విముక్తి చేయడానికి వైద్యఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. అన్ని గృహాలకు వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బందిని రంగంలోనికి దింపింది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల పరిధిలోని టీబీ యూనిట్‌లో సత్తెనపల్లి, ఫణిదం, ముప్పాళ్ల, పెదకూరపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 180 మంది వరకు క్షయ బాధితులున్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 30 వేల మందికి టీబీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సత్తెనపల్లి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్ తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి ఎక్కువ రోజులు దగ్గుతో బాధపడుతున్న వారి నుండి కఫం నమూనాలను సేకరిస్తారు. మద్యం, ధూమపానం అలవాటు ఉన్నవారు, మధుమేహం, కిడ్నీ సంబంధిత, హెచ్ఐవీ, క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి, క్షయకు మందులు వాడి తగ్గిపోయిన వారి కుటుంబ సభ్యులకు టీబీ పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తారు. అంతే కాకుండా క్షయ పోషణ పథకం కింద ప్రతి నెలా వెయ్యి రూపాయలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. క్షయ నివారణ మందులను క్రమం తప్పకుండా వాడేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు సర్వే

పాఠశాలలో పొగాకు కంపు..

● వంగిపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పొగాకు బేళ్లు
● అదే ఆవరణలో అంగన్వాడీ, వెల్‌నెస్ కేంద్రాలు
● పొగాకు కోరుతో విద్యార్థులకు తప్పని ఆరోగ్య సమస్యలు



వంగిపురం పాఠశాల వరండాలో నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు

ప్రత్తిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బహుళార్థక సాధక ప్రాజెక్ట్ లాగా వంగిపురం ప్రాథమిక పాఠశాల బహుళ కార్యాలయాలకు, అవసరాలకు నిలయంగా మారింది. పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న ఈ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని స్థానికులు వారి ఇష్టమొచ్చినట్లుగా ఉపయోగిస్తున్నారు. దీంతో పాఠశాల పాడుబడిపోతోంది. ఈ పాఠశాల ప్రాంగణంలో గదులు ఖాళీగా ఉండటంతో వెల్‌నెస్ సెంటర్, అంగన్వాడీ కేంద్రం ఇక్కడే నడుస్తున్నాయి. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో.. పాఠశాల భవనంలో స్థానికులు పొగాకు బేళ్లు వేశారు. ప్రాంగణం మొత్తం పొగాకు వాసనతో ఘాటెక్కి పోయింది. వారం క్రితం అంగన్వాడీ కేంద్రాన్ని రీ ఓపెన్ చేశారు. ఇక ఆరోగ్య కేంద్రానికి నిత్యం వచ్చే రోగులు ఈ పొగాకు ఘాటుకే.. ఆసుపత్రిలో చేరేలా ఉన్నారు. ఇంకో వారం రోజుల్లో పాఠశాలలు కూడా పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాల ఆవరణలో ఉన్న పొగాకును ఇప్పుడు తీసినప్పటికీ దాని ఘాటు మాత్రం చాలా కాలం అలాగే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల తిమ్మాపురంలో గిడ్డంగిని ఓపెన్ చేశారు. అందులో రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఆ గిడ్డంగి ప్రారంభం కాకముందు రైతులు తాము పండించిన పొగాను నిల్వ ఉంచుకునేందుకు అవకాశం లేకపోవడం వల్ల ఇక్కడ నిల్వ ఉంచుకున్నారు. ఆ తరువాత అయినా ఇక్కడి నుండి నిల్వలను తరలించాల్సి ఉంది. కాని అలా చేయక పోవడంతో ఇప్పుడు ప్రజలతో పాటు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఇక్కడి నుండి పొగాకు బేళ్లు తీసి వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు



ఫైర్..డే

ప్రతాపం చూపిస్తున్న రోహిణి

రోహిణి ప్రథమార్ధంలో రుతుపవనాల వల్ల కొంత చల్లబడినా.. తరువాత నైరుతి ముఖం చాటేయడంతో గత నాలుగు రోజులుగా తన ప్రతాపం చూపుతోంది. దీంతో ఉదయమే వేడిగాలులు వీస్తున్నాయి. శుక్రవారం ఎండ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఎండ నుంచి రక్షణ కోసం స్కార్ఫ్‌లు, గొడుగులను ఉపయోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు బయటికి వస్తున్నారు. - గుంటూరు- ఆంధ్రజ్యోతి







ఇలా అయితే.. ఎలా సహకరించాలి?

సీఆర్డీఏ అధికారులను నిలదీసిన రైతులు



సీఆర్డీఏ అధికారులకు సమస్య చెబుతున్న రైతు పున్నయ్య

తుళ్లూరు, (మందడం) జూన్ 6, (ఆంధ్రజ్యోతి): 'గ్రామ కంఠాల తేల్చరు.. ప్లాట్లకు వీధి పోట్లు వచ్చాయని సమస్య చెబితే.. పెడచెవిన పెడతారు.. మీకు ఏ రకంగా సహకరించాలి.' అని సీఆర్డీఏ అధికారులను మందడం రైతు లు నిలదీశారు. మంద డం సీఆర్డీఏ యూనిట్ ఆఫీసులో డిప్యూటీ కలెక్టర్ భాగ్యరేఖ అధ్యక్షతన ఈ-8 రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశామని డీసీ కోరటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు రోడ్డు వేయండి.. అక్కడి వరకు వచ్చిన తరువాత స్వచ్ఛందంగా ఖాళీ చేస్తామని రైతులు స్పష్టం చేశారు. నీరుకొండ స్వప్నకు చెందిన ఆరు ఎకరాలకు సంబంధించిన ప్లాట్లు, మాదల శ్వేతకు చెందిన రెండున్నర ఎకరాలకు చెందిన రిటర్నబుల్ ప్లాట్లు ల్యాండు ఎక్విజేషన్ భూములలో కేటాయించారని ఇంత వరకు... ఆ సమస్య తేల్చలేదని నిలదీశారు. ఇలాగైతే ఎలా సహకరించాలని రైతులు ప్రశ్నించారు. రోడ్డు కింద పోతున్న ఇళ్లు ఖాళీ చేస్తాం ..తిరిగి ఎక్కడ ఇస్తారో చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు, కాల్వల వెంట ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతున్నారని.. వాటిని ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. ముందు సమస్యలు పరిష్కరించాలని రైతులు సమావేశంలో కోరారు. ఆలయాలున్నాయనే పేరుతో రోడ్డు ఎలైన్‌మెంటు మార్చారని, దీంతో రోడ్డు కింద ఇళ్ల స్థలాలు కోల్పోయే వారి సంఖ్య పెరిగిందని చెప్పుకొచ్చారు. దీనిపై పునరాలోచన చేయాలని రైతులు అధికారులకు సూచించారు. సమస్యలు పరిష్కరించమని కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని రైతు మాదల పున్నయ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయ విద్యార్థులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న న్యాయవాదులు, విద్యార్థులు



ప్రసంగిస్తున్న రిటైర్డ్ జస్టిస్ యూ దుర్గాప్రసాద్‌రావు

తాడేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలోని కేఎల్ యూనివర్సిటీలో అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఆధ్వర్యంలో న్యాయ విద్యార్థులకు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐలూ అధ్యక్షుడు వికాస్ రంజన్ భట్టాచార్య (రాజ్యసభ సభ్యుడు) సెషన్‌ను ప్రారంభించగా, ఏపీ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ యూ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టాచార్య మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నిత్యం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ఉత్తమ న్యాయవాదులుగా ఎదుగుతారని అన్నారు. సబ్జెక్టుపై అవగాహనతో పాటు సామాజిక దృక్పథం కూడా ఉండాలని తెలిపారు. నిర్వాహకులు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులకు 15 అంశాలపై తమ ప్రతిభను, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ పార్టీషన్ దావాల గురించి వివరించగా, పలువురు వక్తలు, న్యాయవాదులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బార్ అసోసియేషన్‌ల నుండి న్యాయవాదులు, 500 మందికి పైగా న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, ఈ శిక్షణ తరగతులు శనివారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు నర్రా శ్రీనివాసరావు తెలిపారు.

తెనాలి వార్తలు
◆ తెనాలి ◆ పొన్నూరు

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. శిక్షణపొందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కథ చెప్పడం, పాటలు, వ్యాసరచన, స్వర్ణాంధ్ర అంశాలలో మూడు విభాగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు అబ్దుల్ హుస్సేన్, లక్కరాజు లక్ష్మణరావు, బొల్లిముంత కృష్ణ శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి పూర్ణచంద్రరావు, లావణ్యసుధ, పద్మావతి పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు శాఖ గ్రంథాలయంలో చివరి రోజు శిక్షణ శిబిరంలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రామ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎస్‌కే కరిముల్లా హాజరై విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి కడియాల సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి
● కమిషనర్ బండి శేషన్న

తెనాలి, మారీసుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు యోగాంధ్రా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళా క్షేత్రంలో జరుగుతున్న యోగాంధ్ర శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తహసీల్దార్ గోపాలకృష్ణతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జూలై 21న జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి పట్టణంలో యోగాంధ్ర శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు యోగాపై వ్యాసరచన పోటీలు, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, మున్సిపల్ అధికారు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మగాంధీ శాంతి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు మోటూరి విజయలక్ష్మి కుమారుడు, కోడలు మోటూరి యుగంధర్, లక్ష్మి అన్నపూర్ణ, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీచేసి అన్నదానం చేశారు. అనంతరం పట్టణంలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, షిరిడి సాయి వృద్ధాశ్రమం, శబరి వృద్ధాశ్రమాలలో 100మంది వృద్ధులకు నిత్యావసరాలు బియ్యం, కంది పప్పు, నూనె, గోధుమరవ్వ, పేస్టులు, సబ్బులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య, కేశవ్, గౌరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కొల్లా ధర్మకుమార్, పద్మనాభం, సత్యనారాయణ, మురళి, భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

తెనాలి, మారీసుపేట,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేడు శనివారం సువర్ణ భారతి క్షేత్రంలో సరస్వతీ దేవాలయం నిర్మాణానికి భూమి పూజను నిర్వహించనున్నామని శ్రీవిద్యాపీఠం ట్రస్ట్, సాలిగ్రామ టస్ట్ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఈ దేవాలయం భూమి పూజను పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షించనున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ముద్దాబత్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు శివాలయం పునః నిర్మాణానికి శంకుస్థాపన

కొల్లిపర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో శ్రీగంగాపార్వతి సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ ంలో విగ్రహ పునఃప్రతిష్ట ఈ నెల 8వ తేదీన ఆదివారం ఉదయం 7.42 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొల్లిపర శివాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ శివాలయం పునః నిర్మాణానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.

నిరుపయోగంగా మున్సిపల్ స్థలాలు

● ఆదాయం పెంపుపై దృష్టి సారించని అధికారులు
● పలుచోట్ల శిథిలావస్థలో మున్సిపల్ కాంప్లెక్స్‌లు
● నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లతో ఆదాయం


ఖాళీగా ఉన్న విలువైన మున్సిపల్ స్థలం

తెనాలి, మారీసుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉన్న విలువైన మున్సిపల్ ఖాళీ స్థలాలు నిరుపయోగం ఉంటున్నాయి. ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకుని మున్సిపాల్టీకి ఆదాయం పెంచుకునేందుకు అధికారులు దృష్టి సారించటం లేదు. శిథిలావస్థలో ఉన్న పలు కాంప్లెక్స్‌ల స్థానంలో నూతన భవన సముదాయలను సమకూర్తిస్తే పురపాలక సంఘానికి అదనపు ఆదాయం గడించవచ్చు. పురపాలక సంఘం పరిధిలో 22మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్స్‌ల్లో 234షాపులు ఉన్నాయి. వీటి ద్వారా పురపాలక సంఘానికి ఆదాయం లభిస్తోంది. కాని వీటిలో కొన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లు శిథిలావస్థకు చేరాయి. అందులో ముఖ్యంగా కొత్తపేటలోని మునిసిస్వామినాయుడు రోడ్డులోని 9 షాపులు శిథిలావస్థకు చేరాయి. వాటిని తొలగించి నూతన బహుళ అంతస్థుల షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే మరింత మందికి జీవనోపాధితో పాటు మున్సిపల్ కార్యాలయానికి అదనపు ఆదాయం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు. గాంధీ ఇర్విన్ పార్కులో తాత్కాలికంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు వీటిని కూడా నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల రత్నా టాకీసు వద్ద మున్సిపల్ స్థలంలో ఆక్రమణలనుతొలగించిన కోట్లాది రూపాయలు విలువచేసే స్థలం నిరుపయోగంగా ఉంచారు. ఆక్రమణల దారుల కన్ను వీటిపై పడకముందే అందులో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి పలువురుకి జీవోపాధి కల్పించడంతో పాటు మున్సిపల్ కార్యాలయానికి అదనపు ఆదాయం సమకూరే అవకాసం ఉంటుందని ఆ వార్డు ప్రజలు అంటున్నారు. ఆదేవిధంగా మారీసుపేటలోని మునిసపల్ మున్సిపల్ స్థలంలో గతంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి అద్దెలకు ఇచ్చారు. గత కొంత కాలంగా వాటి అద్దెలను మున్సిపల్ అధికారులు వసూలు చేయకపోవడం, వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో విలువైన స్థలం అన్యాక్రాంతం అవడంతో పాటు మున్సిపల్ ఆదాయానికి గండిపడిందని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు దృష్టిపెట్టి పురపాలక సంఘ ఆస్తులను కాపాడటంతో పాటు ఆదాయ వనరులుగా మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.


మారీసుపేట, మునిస్వామినాయుడు రోడ్డులో శిథిలావస్థలో ఉన్న షాపులు

ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించండి
● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. శుక్రవారం మండలంలోని నందివెలుగులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కాలువలు పూడికతీత, గడ్డి తొలగింపు కూలీల సంఖ్య వంటి వాటిపై ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనుల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కూలీలతో మాట్లాడి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రతిరోజు కూలీల హాజరు తప్పనిసరిగా తీసుకోవాలని పనిచేసిన కాలువలు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎక్కడా కూడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకున్నా సహించేది లేదన్నారు. పలువురు అధికారులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


పని ప్రదేశంలో సూచనలు చేస్తున్న ఎంపీడీవో అత్తోట దీప్తి

కొలకలూరును పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం

మండలంలోని కొలకలూరు గ్రామాన్ని పరిశుభ్రతలకు నిలయంగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో అత్తోట దీప్తి చెప్పారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కొలకలూరులో రోడ్డుపై మురుగు కథనానికి ఆమె స్పందించారు. ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌తో కలిసి మండలంలోని కొలకలూరులో వార్డుల వారీగా పర్యటించారు. పలు వార్డుల్లో చెత్తపేరుకుపోయి మురుగు నిలిచిపోయి ఉండటాన్ని ఎంపీడీవో గుర్తించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి మంత్రి మనోహర్ ఆదేశాలతో త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి వార్డులో నెలకొని ఉన్న శానిటేషన్ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని దీప్తి స్పష్టం చేశారు. ప్రతిరోజు శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్‌తో సాధ్యమైనంత మేర సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేలా అధికార యంత్రాగానికి ఆదేశాలిచ్చారు. గ్రామ పంచాయతీ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలుడికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో గాయపడ్డ బాలుడు మహేష్‌కు యంగ్ జనరేషన్ ఫౌండర్ షేక్ సాధిక్ రూ.10వేలు సాయం శుక్రవారం అందించారు. పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సుధాకర్ కుమారుడు ఇటీవల విద్యుదాఘాతంవల్ల చేతిని కోల్పోయాడు. పేద కుటుంబం కావడంతో వైద్య సౌకర్యాల నిమిత్తం ఈ సాయాన్ని అందించారు. బాలుడు విద్యకు అవసరమైతే ముందుంటామని హామీ ఇచ్చారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్

కొల్లిపర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ దోమల నిర్మూలనపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో ఉన్న మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్‌ను చల్లించాలన్నారు. బహిరంగ మలవిసర్జన నేరమన్నారు. రోడ్లను బహిర్భూమిగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. గ్రామకార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల గోవిందనామ సంకీర్తన


చిన్నారులకు మెమొంటోలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో జేష్ట శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని 108మంది బాలబాలికలు చేసిన గోవిందనామ సంకీర్తన ఆకట్టుకుంది. శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం కోలాటంతో చేసిన ప్రదక్షిణ, కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించి బాల బాలికలను తిరుమల కూడా తీసుకు వెళుతున్నామని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. కీర్తనలు ఆలపించిన వారందరికి మెమొంటోలు బహూకరించారు. అందే చంద్రమౌళి, కేశవ రావు, రవి, దేవానంద్, భారతి, రమాదేవి, మాజేటి వాసవి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలందుకున్న చంద్రశేఖరస్వామి


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న సాయిరేవతి, క్రీడాకారులు

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందనలు

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్‌లో తెనాలి ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న క్రీడాకారులు అభినందనీయులని తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ పేర్కొన్నారు. బస్టాండ్ వద్ద ఉన్న క్విక్ అకాడమీలో శుక్రవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు 20పతకాలు సాధించారు. మదిర షానూన్ రెండు బంగారు పతకాలు, ఏలూరి లక్ష్మీవినయశ్రీ బంగారు, వెండి పతకాలు, బొల్లు లిఖిత బంగారు వెండి కాంస్య పతకాలు, హిమసాయిబిందు కాంస్య పతకం, వినయశ్రీ స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ కూడా దక్కించుకుంది. పురుషుల విభాగంలో మానిచంద్ రెండు బంగారు పతకాలు, మణీశ్వర్‌రామ్ బంగారు పతకం, కౌషిక్ బంగారు, వెండి, కాంస్య పతకాలు, ప్రణీత్ వెండి పతకం, కుమార్ ధర్మతేజ వెండి పతకం, స్ట్రాంగ్ మెన్ టైటిల్‌ను మణీశ్వర్‌రామ్ సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు షానూన్, వినయశ్రీ, లిఖిత, మానిచంద్, మణీశ్వర్‌రామ్, కౌషిక్‌లు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించాలని తహసీల్దార్ అభిలషించారు. కోచ్ ఘట్టమనేని సాయిరేవతి, భార్గవకుమార్‌లు తహసీల్దార్‌ను సత్కరించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు నారాకోడూరు విద్యార్థుల ఎంపిక

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు నారాకోడూరు జిల్లా పరిషత్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి స్కాలర్ షిప్ పోటీ పరీక్షలలో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కేశంశెట్టి హారిక, వెలగా అవినాష్, ఎం.లహరి, కాగితాల షారోన్, దాసరి కృష్ణతులసి, తుపాకుల రవిశంకర్, ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున విద్యార్థులకు ఉపకార వేతనాలు అందనున్నట్లు చెప్పారు. స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా శ్రీ రేణుకాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొల్లిపర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరులోని శ్రీ రేణుకాదేవి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పండితులు శివానందం, రాంబాబులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు భజనలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠా పూజలు ప్రారంభం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులోని గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల వీచిన ఈదురు గాలులకు ధ్వజ స్తంభం విరిగిపడిపోయింది. గ్రామస్థులు, భక్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దేవదాయశాఖ అధికారులతో సంప్రదించి ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠకు కృషిచేశారు. ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా తొలిరోజు విష్ణు సహస్ర నామ పారాయణం రుద్ర పారాయణం ప్రారంభించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు.


గోవధ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న పక్కన ఆర్‌వో రాంప్రసాద్ తదితరులు

నేడు పట్టణంలో గోవధ నిషేధం
● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేడు శనివారం పట్టణ పరిసర ప్రాంతాలలో గోవధ నిషేధం అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి పట్టణ పరిధిలోని మాంసం వ్యాపారులతో బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి గోవధ చేయరాదన్నారు. మాంసం విక్రయదారులు ఎవరూ నిబంధనలను అతిక్రమించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమలో మున్సిపల్ అసిస్టెంట్ సీటీ ప్లానర్ శివన్నారాయణ, ఆర్‌వో రాంప్రసాద్, మున్సిపల్ అధికారులు, మాంసం అమ్మకం దారులు తదితరులు పాల్గొన్నారు. శివాజీచౌక్‌లోని జామియా మసీద్ ప్రాంగణంలో గోవధ నిషేధంపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ముస్లిం మతపెద్దలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని గోవధను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మసీద్ కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

బక్రీదును ప్రశాంతంగా జరుపుకోవాలి: తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో చెప్పారు. జూన్ 7న బక్రీదు పండుగను పురస్కరించుకుని గోవధను నిషేధించడం జరిగిందన్నారు. గోవులు తరలింపుపై నిషేధం ఉందన్నారు. ఎవ్వరూ కూడా గోవులను తరలించడం, జంతు వధ వంటి వాటికి పాల్పడవద్దని హెచ్చరించారు. గోవుల తరలింపుపై ప్రత్యేక అధికారులను టీంగా నియమించామన్నారు. వీరు నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తారన్నారు. గోవులను తరలిస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.


అంజుమన్ కమిటీకి రూ 2.5 లక్షల విరాళాన్ని అందజేస్తున్న జెలీల్ అండ్ సన్స్ నిర్వాహకులు

అంజుమన్ కాంప్లెక్స్‌కు రూ.2.5 లక్షల విరాళం

పొన్నూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు అబ్దుల్ జలీల్ అండ్ సన్స్ రూ. 2.50 లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌కు బంగారు వర్తకుడు జలీల్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సలీం కమిటీ అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్‌కు ఈ నగదు అందించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ నిర్వాహకులు అబ్దుల్ జలీల్ కుటుంబ సభ్యులను సత్కరించారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు భూ పోరాటాల ద్వారా భూమిని పంచి పెట్టిన పోరాటయోధుడు చంద్ర రాజేశ్వరావు అని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దున్నేవానికి భూమి దక్కాలని, భూ పోరాటాలను చేశారని గుర్తుచేశారు. డాక్టర్ వైద్య విద్యను అభ్యసించడానికి బెనారస్ వెళ్లిన మార్క్సిజం వైపు ఆకర్షితులై స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా కమ్యూనిస్టు పార్టీ ద్వారా పేదల పక్షాన పోరాడారని గుర్తుచేశారు. నైజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని నడిపి పది వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు భాషా, శ్రీను, రామారావు, సుభాని, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి నిమ్మకాయల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైష్ణవి కళాశాల విద్యార్థులకు ప్రతిభ అవార్డులు


శ్రీరామ్, సాయిరామ్‌చరణ్

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాస్ గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ అవార్డులకు సీనియర్ ఇంటర్ సీఈసీ గ్రూపులో వెయ్యికి 955 మార్కులు సాధించిన కె.శ్రీరామ్, దీవి రామ్‌చరణ్‌లను అవార్డుకు ఎంపికచేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ అవార్డు కింద రూ.20వేలు నగదు, మెడల్‌ను అందుకోనున్నారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

నేడు క్రిస్టియన్‌పాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు అభిమానులు తరలి రావాలని కమిటీ కన్వీనర్ తెనాలి మోహనరావు కోరారు. విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను శుక్రవారం తెనాలిలో విడుదల చేశారు. కొల్లిపర మండలం తుములూరు శివారు క్రిస్టియన్‌పాలెంలో ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణకు ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

హ్యూమన్ రైట్స్ జాయింట్ సెక్రెటరీగా సాయికృష్ణ

మంగళగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ జాయింట్ సెక్రెటరీగా మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన జీవీ సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జ్యోతీశ్వర్ రెడ్డి నుంచి నియామకపత్రం అందినట్లు సాయికృష్ణ తెలిపారు. గతంలో సాయికృష్ణ హ్యూమన్ రైట్స్ ఏపీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ముగ్గురు బాలికల ఎంపిక

దుగ్గిరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి దుగ్గిరాల బాలికల హైస్కూల్ విద్యార్థినులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శానంపూడి శోభాదేవి తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన గొర్రిపాటి విష్ణుప్రియ, మోకా మేఘన, ఎండేటి లక్షితలను హెచ్‌ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఏటా రూ.4వేల చొప్పున వారికి ఉపకారవేతనంగా అందిస్తుందని హెచ్‌ఎం తెలిపారు.

పాఠశాలకు రూ.5075 విద్యార్థి విరాళం

తాను చదివిన పాఠశాల మౌలిక సదుపాయాలకు వినియోగించుకునేందుకు ఓ విద్యార్థిని ఆర్థిక సాయం అందించింది. గత పదోతరగతి పరీక్షల్లో ప్రథమర్యాంకు సాధించిన చలవాది ప్రగతి రూ.5075 నగదును హెచ్‌ఎం ఎస్.శోభాదేవికి శుక్రవారం అందించింది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 791 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,500, గరిష్ఠధర రూ.10,450, మోడల్‌ధర రూ.10,290పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,500, గరిష్ఠధర రూ.10,350 మోడల్‌ధర రూ.10,250 పలికాయి.

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

దుగ్గిరాల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం మోరంపూడిలో 500 ఏళ్లనాటి పురాతనమైన శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన చింతమనేని పాండురంగారావు, సుశీల దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు పనులు ప్రారంభించారు.

బంగారం చోరీ చేసిన కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్ లో ఒక కళ్యాణ మండపంలో చోరీ కేసులో మిస్టరీ చేదించారు. ఈ మేరకు శుక్రవారం వెస్ట్ డీఎస్పీ అరవింద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన మూల్పూరి హనుమంతరావు దంపతులు గత నెల 11న అమరావతి రోడ్డులో గల విజయం కళ్యాణ మండపంలో ఆయన మేనల్లుడు వివాహానికి వచ్చారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న నగల బ్యాగును వరుడు గదిలో పెట్టారు. కొద్ది సమయం తర్వాత ఆ గదిలో పరిశీలించగా బ్యాగ్ కనిపించలేదు. కాగా ఈ ఘటనపై ఈనెల 4న బాధితుడు హనుమంతరావు అరండల్ పేట పోలీస్ స్టేషన్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన గుంజి గోవిందుగా గుర్తించారు. గోవిందును అదుపులోకి తీసుకొని ఆయన చోరీ చేసిన ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు కళ్యాణ మండపం జరుగుతున్న పెళ్లిలో భోజనం చేసేందుకు వచ్చాడు. వరుడి గదిలో బ్యాగు కనిపించడంతో అవకాశం దొరకడంతో బ్యాగు అపహరించుకుపోయాడు. అందులో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకొని వచ్చిన సొమ్ముతో తన ద్విచక్ర వాహనం ఈఎంఐలు కట్టాడు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు, సిబ్బంది బ్రాడీపేటలో నిందితుడు గోవిందును అదుపులోకి తీసుకొని ఆయన నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



గ్రీవెన్స్ డేలో రైతుల అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కమిషన్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్

అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తాం

● సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తుళ్లూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. అసైన్డ్ భూముల సమస్యలకు సంబంధించి, రిటర్నబుల్ ప్లాట్ల వీధిపోటు సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంత వాసులు తమ అర్జీలను గ్రీవెన్స్ డేలో ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు విన్నవించారు. అసైన్డ్ భూములపై ప్రభుత్వం ఆదేశానుసారం చర్యలు తీసుకుని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ అర్జీదారులకు తెలియజేశారు. వీధిపోటు గురించి ఇచ్చిన అర్జీలను సీఆర్డీఏ ప్లానింగ్ విభాగం వారికి పంపించి పరిష్కరిస్తామని తె లియజేశారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై రాజధాని రైతులు తెలియజేసిన ఫిర్యాదులలో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల విషయంలో అలసత్వం వద్దని సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సాయిశ్రీనివాస్ నాయక్, ఎం. శేషిరెడ్డి, భాగ్యరేఖ, పి.పద్మావతి, చిన్నికృష్ణ, స్వర్ణమేరీ, భీమారావు, సీఆర్డీఏ డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

వట్టిచెరుకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సాగుతున్న బ్రహ్మేశ్వర కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం సాయంత్రం రథోత్సవాన్ని గ్రామస్తులు, మహిళలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. దేవాలయ ఈవో కృపారెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం రథాన్ని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ పూజారి కృష్ణ స్వామి, ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో నూతన వధూవరులైన బ్రహ్మేశ్వర స్వామి, భ్రమరాంబిక దేవి, గంగాదేవిల మూలవిరాట్‌లను అందంగా అలంకరించి రథంపై ఆశీనులను చేసి దేవాలయం నుంచి గ్రామ సెంటర్‌లోని ఆర్అండ్‌బీ రోడ్డు వరకు రథ యాత్రను నిర్వహించారు.



అందంగా ముస్తాబైన స్వామి వారు, స్వామివార్లతో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

● పాల్గొన్న రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్

తాడేపల్లి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని మహానాడు రోడ్డులో సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శైవ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ శివస్వామి వేదమంత్రాల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగాయి. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, భారత యాదవ సంఘం చైర్మన్ లాక్ వెంగళరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్లు అభివృద్ధి చేయాలి

తాడేపల్లి టౌన్ జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన ప్లాట్లను తక్షణమే అభివృద్ధి చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి జొన్న శివశంకరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్ ప్రజా సంఘాల కార్యాలయంలో జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన రాజధాని రైతు సంఘం కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జొన్న మా ట్లాడుతూ, రైతుల ప్లాట్‌లకు బ్యాంకు రుణాలు ఇవ్వాల్సిందిగా కోరారు. కేంద్రం ప్రకటించిన పంట ల మద్దతు ధరలు చాలా అన్యాయంగా ఉన్నాయని, పునరాలోచించాలని కోరారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చన హామీల ప్రకారం మద్దతు ధరల కమిటీ ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో సంప్రదింపులు చేయకుండానే మద్దతు ధరలు ప్రకటించటం సబబు కాదన్నారు. అత్యధికంగా సాగుచేసే ధాన్యానికి క్వింటాకు కేవలం రూ.69 పెంచడం చాలా అన్యాయమని, ఉత్పత్తి వ్యయానికి 50శాతం అదనంగా కలిపి క్వింటాకు రూ.3135 పెంచాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రూ.20వేలు తక్షణమే రైతు ఖాతాలో జమ చేయాలన్నారు. కౌలు రైతుకు భూ యజమానితో సంబంధం లేకుండా కార్డులు ఇవ్వాని కోరారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నె 11న మంగళగిరి ఆటోనగర్ సీసీఎల్ ఆఫీసు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతుసంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, పి.వీరాస్వామి, ఎస్కే ఎర్రపేరు, ఈ రామారావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం కేంద్రాల తనిఖీ

గుంటూరు సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు ప్రత్యేక ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలోని పొగాకు వేలం కేంద్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆ మేరకు పేరేచర్ల సమీపంలోని డోకిపర్రు పొగాకు వేలం కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు. సదరు కేంద్రంలో ఇప్పటివరకు 25 లక్షల కిలోల తెల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు బయ్యర్లు తెలియజేశారు. రెండు లక్షల కిలోల నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఉత్పత్తులు, నాణ్యత బట్టి కిలో రూ.40 నుంచి రూ. 120 వరకు వెచ్చించి కొనుగోళ్లు జరుగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు నెలల్లో రైతుల వద్ద నున్న మొత్తం నిల్వలను కొనుగోలు చేయాలని రైతులు జిల్లా వ్యవసాయ అధికారికి విజ్ఞప్తి చేశారు.



డోకిపర్రు పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి నాగసాయి కుమార్

మీ గ్రామాన్ని మీరే శుభ్రంగా ఉంచుకోవాలి

● డీపీవో నాగసాయి కుమార్

ప్రత్తిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మీ గ్రామాన్ని మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డీవీ నాగసాయి కుమార్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో గ్రామంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానంతో పాటు రోడ్డు పైన చెత్త వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రచ్చబండ వద్ద గ్రామస్థులతో డీపీవో మాట్లాడుతూ మోడల్ గోల్డెన్ ఎల్‌టీసీ గా తుమ్మలపాలెం గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుండి అధికారులు, ప్రజా ప్రతినిధులు మీ గ్రామాన్ని సందర్శిస్తారని, గ్రామం ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవడానికి మీ అందరి సహకారం అవసరం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ నుండి ఆర్పీలు నిరంజన్, అనురాధ, పంచాయతీ కార్యదర్శి ఖాజా, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండలాల నుండి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో హెచ్చరిక బోర్డులు

● తహసీల్దార్ జే ప్రసాదరావు

ఫిరంగిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఫిరంగిపురం, అమీనాబాద్, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని సీలింగ్ భూముల్లో శుక్రవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తహసీల్దార్ జే ప్రసాదరావు తెలిపారు. మూడు గ్రామాల్లో మొత్తం 32.69 ఎకరాల సీలింగ్ భూముల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించ రాదని, ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. 1908లో నమోదైన ఈనాం దారుల కుటుంబ సభ్యుల పేర్లతోనే ఇప్పటికి భూములు అలాగే ఉన్నాయని, వెబ్ ల్యాండ్, అడంగల్ ఆనాటి ఆర్ఎస్ఆర్‌ల ప్రకారమే రెవెన్యూ రికార్డులు ఉన్నాయన్నారు. రెవెన్యూ సిబ్బందితో కలసి విచారణ జరిపామని ఆయన చెప్పారు. మండలంలోని సీలింగ్ భూములు ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని ఆయన తెలిపారు. ఈనాం భూముల పై సీసీ కేసు నెంబరు 618 అండ్ 1952/జీ.ఎన్.టీ/1975 ల్యాండ్ రిఫార్మ్ ట్రిబ్యునల్ గుంటూరులో కేసు విచారణలో ఉందని ఆయన పేర్కొన్నారు.



సీలింగ్ భూములపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

జనాభాను పెంచుకోవాలి

తాడికొండ(లాం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభాను పెంచుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని లాం పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం లాం పంచాయతీ కార్యాలయంలో జనాభా నిర్వహణ విధానం-ప్రతి కుటుంబం-మీ అభిప్రాయం మార్గదర్శనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ అబిదా అలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు యువత పెరుగుదల శాతం తగ్గిపోతుందన్నారు. యువత తగ్గిపోతే దేశంలో పని చేసేవారి శాతం తగ్గిపోతుందన్నారు. దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని తెలిపారు. వివాహాలు చేసుకునే వారు ముగ్గురు పిల్లలను తప్పకుండా కనాలని సూచించారు. రోజు రోజుకు యువత శాతాన్ని పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

7.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాకుమాను, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7.5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కాకుమానులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించి నిందితుడిని, రేషన్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి తరగతులు

మంగళగిరి సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో దాదాపు నెల రోజులకు పైగా జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి ఎస్.నరసింహారావు మాట్లాడుతూ వేసవి శిబిరాన్ని విద్యార్థులు చక్కగా వినియోగించుకున్నారని తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగిన ఈ క్యాంపులో విద్యార్థులకు సెలవులను సక్రమంగా వినియోగించుకోవడం, ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించే అలవాటు చేసుకోవడం, కథలు వినడం, చిత్రలేఖనం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు వంటి అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి టీ శ్రీనివాసరావు, శానిటేషన్ సూపర్‌వైజర్ అంజిబాబు, గ్రామ పెద్దలు జొన్నల శివరామిరెడ్డి, జొన్నల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న గ్రామ పెద్దలు

మంగళగిరి శాఖా గ్రంథాయలంలో..

మంగళగిరి సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శాఖా గ్రంథాయలంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వేసవి తరగతుల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి గ్రంథాలయాధికారి ఎన్.ఆరోగ్యం, డీఎస్‌కే శర్మ, సిబ్బంది పీ కృష్ణ, ఎస్‌కే అబ్దుల్ గఫూర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు కుమారుడు దిలీప్, ఇగ్నితల వివాహ వేడుక శుక్రవారం రాత్రి మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

-మంగళగిరి సిటీ

10న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 6(ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 10న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌లో జిల్లా సీనియర్ అథ్లెటిక్ జట్టు ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్ల దాటిన బాల, బాలికలు పోటీలకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి ఏఎన్‌యూలో జరిగే ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అదే రోజు ఉదయం యూనివర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో రిపోర్టు చేయాలని కోరారు.

ఎన్‌హెచ్-16కి ర్యాంపుల మంజూరుకు కృతజ్ఞతలు

● విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి సత్యనారాయణ

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-16కి పెదకాకాని వద్ద ఇరువైపులా ర్యాంపులు మంజూరు చేసినందుకు జేకేసీ కళాశాల రోడ్డులో నివసించే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పీ.సత్యనారాయణ శుక్రవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కాలంలో ఈ రోడ్డులో 109 ప్రమాదాలు జరగగా వాటిల్లో 106 మంది తీవ్రంగా, 29 మందికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాల డ్రైవింగ్‌ని నిరోధించేందుకు తాము సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. అలానే రోడ్డు ప్రమాదాల గణాంకాలను సేకరించి ఎన్‌హెచ్ఐఏ అధికారులకు కూడా పంపించామన్నారు వీటన్నింటికి కేంద్ర ప్రభుత్వం స్పందించి రూ.9.59 కోట్ల నిధులను ఎన్‌హెచ్ఏఐకి మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ర్యాంపుల పనులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు. కనుక ఈ జగత్తు, వేదములలో పురుషోత్తముడిగా ప్రసిద్ధి పొందాయని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి తెలియజేశారన్నారు.

ప్రవేశాలు నిరాకరిస్తే యాజమాన్యాలపై చర్యలు

గుంటూరు (విద్య) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ద్వారా సీట్లు పొందిన విద్యార్థులను నిర్దేశించిన పాఠశాలల్లో చేర్పించేలా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీవో పద్మావతి స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయంలోగా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆయా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. పాఠశాలల యాజమాన్యం ఏవైనా ఆటంకాలు కల్పిస్తే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఎటువంటి ఫీజు చెల్లించరాదని , పాఠశాల యాజమాన్యాలు ఫీజు చెల్లింపు చేయాలని డిమాండ్ చేస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా హక్కు చట్టం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 10లోగా పాఠశాలల్లో చేరాలని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యలు ఉన్న సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఫణీంద్ర రెడ్డి తదితరులు

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

మంగళగిరి సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన మండెపూడి పోలేస్ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా, ఉయ్యూరు నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్టు తరపున మట్టి ఖర్చులకు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్ ఉయ్యూరు ఫణీంద్ర రెడ్డి, నరేంద్ర రెడ్డి, బొమ్మా కిషోర్ రెడ్డి, కంఠం బుల్లి రెడ్డి, తాడిబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.